


సోమశిలలో 59.490 టీఎంసీల నిల్వ



అనంతసాగరం ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి 18,452 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ఇక డ్యాంలో 59.490 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



పాదలకూరు : లింగేశ్వరుడికి ప్రదక్షిణగా...



కందుకూరు : వాసవీ గ్రంథాలయంలో



కావలిలో గరుడారూఢుడై...



నెల్లూరు బాలాజీ నగర్‌లో బాల గణేశ్



అల్లూరులో తొమ్మిది అడుగుల మట్టి గణపతి



సంగం : ఉత్సాహంతో ఉట్టికొడుతున్న బాలురు

జై.. జై గణేశా!

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి • వాడవాడలా ఉత్సవ మండపాలు • దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు





విఘ్నాలను తొలగించి, సకాల శుభాలను వొసగే విఘ్నేశ్వరుడిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో కొలిచారు. వినాయక చవితి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఊరూరా.. వాడవాడలా మండపాలు కట్టి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వేలకుపైగా తాత్కాలిక గణపతులను ఏర్పాటు చేశారు. అపార్ట్‌మెంట్లలో, ఇంటింటా లక్షలాది మట్టి గణపతులను భక్తితో పూజించారు. మండపాల్లో 3 నుంచి 9 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వినాయక ఆలయాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కాగా, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కుటుంబంతో కలిసి నెల్లూరు కాపువీధిలో ఆనం యువసేన, కాపు వీధి మిత్రమండలి ఏర్పాటు చేసిన గణపతికి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులతో నగరంలోని పలు డివిజన్లలో ఏర్పాటు గణపతి మండపాలను దర్శించి పూజలు చేశారు. అందరి సంక్షేమం, పాడి పంటలు సమృద్ధిగా వర్ధిల్లేలా దీవించాలని గణపతిని కోరామని మంత్రులిద్దరు తెలిపారు. అలాగే జిల్లాలోని శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు గణేశ మండపాలు సందర్శించి పూజలు చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)





కావలిలో బాలల డప్పుల చప్పుళ్లు



బుచ్చిలో యువత హుషారు



నెల్లూరులో ఆకట్టుకున్న అక్వేరియం ప్రవేశం

ఉత్కంఠ రేపుతున్న కి'లేడి' పోలీస్ కస్టడీ

తొలిరోజు గంటన్నరపాటు విచారణ

నేడు, రేపు పోలీస్ ఉన్నతాధికారుల వంతు

వివరాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు

అరుణ ఏం చెబుతుందో!?

కోవూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అనేక నేరారోపణలు ఎదుర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా సంచలనాలకు కేంద్రబిందువైన కి'లేడి' నిడిగుంట అరుణను పోలీసులు కస్టడీకి తీసుకోవడంతో రాజకీయ, పోలీస్ ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మూడు రోజుల విచారణలో తొలిరోజు శుక్రవారం విచారణ ముగియగా మిగిలిన రెండు రోజుల్లో అరుణ నోరువిప్పి ఏం చెబుతుందోనని అందరిలో ఉత్కంఠ నెలకొంది. పడుగుపాడులోని సాయి ఎస్టేట్ అపార్టుమెంటులో 503వ నెంబరు ప్లాటును ఆక్రమించి బిల్డర్ మునగా వెంకట మురళీకృష్ణమోహన్‌ను చంపేస్తామని బెదిరించిన కేసులో అరుణను కోర్టు రిమాండుకు పంపింది. ఒంగోలు జిల్లా జైలులో రిమాండు ఖైదీగా ఉన్న ఆమెన కోవూరు పోలీసులు కోర్టు అనుమతితో గురువారం కస్టడీకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ గురువారం సిబ్బందితో ఒంగోలుకు వెళ్లి జైలు నుంచి కోవూరు పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ ప్రారంభించారు. కోర్టు నిబంధనల ప్రకారం ఆమె తరపు న్యాయవాది కనిపించేంత దూరంలో కూర్చొని విచారణను చూసేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. విచారణకు తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలన్నీ పూర్తి చేశారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, విచారణ అంశాలు వెలుపలకు పొక్కకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. దీంతో గురువారం సుమారు ఒకటిన్నర గంటపాటు జరిగిన విచారణ వివరాలు వెలుగులోకి రాకపోవడంతో పలు వర్గాల్లో ఆందోళన మొదలైంది. తొలిరోజు నియమ నిబంధనలను పోలీసులు పూర్తి చేయగా శుక్ర, శనివారాల్లో పోలీసు శాఖ ఉన్నతాధికారులు విచారించనున్నట్లు తెలిసింది. గత కొద్దికాలంగా జరిగిన నేరాల గురించి ఆమెను నెల్లూరులోని డీఎస్పీ కార్యాలయంలో ప్రశ్నించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. అధికారులు కోవూరు స్టేషన్‌కు వచ్చి విచారించేందుకు సిద్ధపడితే ఇక్కడే విచారించే అవకాశం ఉంది.



కోవూరు పోలీసు స్టేషన్ నుంచి నెల్లూరు జైలుకు వెళుతున్న అరుణ

సెల్‌ఫోన్ డేటా ఆధారంగా..

రౌడీషీటరు శ్రీకాంత్ పెరోల్ రద్దు తరువాత జిల్లావ్యాప్తంగా ఎన్నో ఆసక్తికర విషయాలు ప్రచారంలోకి వచ్చాయి. నెల్లూరు. తిరుపతి జిల్లాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ఎస్పీలతో అరుణకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వెలుగు చూశాయి. పలు నేరాల్లో ఆమెకు సంబంధం ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే, ప్రతి ఘటననూ ఆమెకు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించే అలవాటు ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఫోన్‌లోని డేటాను పోలీసు అధికారులు పరిశీలించే అవకాశం ఉందనే సమాచారంతో రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, అధికారుల గుండెల్లో దడ మొదలైంది. సెల్‌ఫోన్‌లోని సమాచారంతో ఆమెకు ప్రశ్నలు వేయడానికి పోలీసు అధికారులు ఇప్పటికే సిద్ధమైనట్లు తెలిసింది.

డీజీపీ రాకతో వేడెక్కిన వాతావరణం

నెల్లూరు (క్రైం) : అరుణ నేర సామ్రాజ్యానికి సహకరించిన పోలీసులు ఎవరు!? అండగా నిలిచిన నాయకులు ఎవరు!? గత ప్రభుత్వంలో రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణల దందాలు ఎలా సాగాయి!? ఆ దందాల్లో పాల్గొన్న రౌడీషీటర్లు, నేరస్థులు ఎవరు!? ఇలా అనేక ప్రశ్నలకు జవాబులు రాబట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. అరుణను పోలీసు కస్టడీకి తీసుకున్న రోజే (గురువారం) రాష్ట్ర పోలీసు బాస్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా నెల్లూరుకు రావడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ఇప్పటికే నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని పోలీసు స్టేషన్లలో అరుణ, శ్రీకాంత్‌లు పెట్టించిన తప్పుడు కేసులు, కబ్జాలు, పంచాయితీలు, మోసాలు, సెటిల్‌మెంట్లు ఇలా అన్ని వివరాలు పోలీసులు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. అరుణతోపాటు ఆమె పక్కన ఉండి దందాలను నడిపించిన వారి వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. వాటిన్నింటి గురించి పోలీసులు నేడు, రేపు అరుణను ప్రశ్నించనున్నారు.

బడులకు కొత్త అయ్యోర్లు!

ప్రక్రియ ప్రారంభించిన విద్యాశాఖ

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

జిల్లాలోని ప్రభుత్వ బడులకు కొత్త అయ్యోర్లు రానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పాఠశాల విద్యా శాఖ గురువారం ప్రారంభించింది. డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థుల అన్ని రకాల సర్టిఫికెట్లను రెండురోజుల పాటు పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులు తొలుత తమ సర్టిఫికెట్లను విద్యా శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరమే నేరుగా పరిశీలిస్తున్నారు. నగరంలోని వీఆర్ పీజీ కళాశాలలో గురువారం ప్రారంభమైన ఈ పరిశీలనకు తొలిరోజు 585 మందికి సమచారం అందించగా వారంతా హాజరై పరిశీలన చేయించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారి ధ్రువపత్రాలను శుక్రవారం పరిశీలించనున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

మెగా డీఎస్సీ-2025 సంబంధించి అన్ని సబ్జెక్ట్‌ల మెరిట్ జాబితాలను ఇప్పటికే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నేపథ్యంలో వివిధ కేటగిరీ పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ పరిశీలనను విద్యాశాఖ అధికారులు చేపడుతున్నారు. దీనికోసంగా మొత్తం 17 కమిటీలను నియమించగా తొలిరోజు 13 కమిటీల నేతృత్వంలో పరిశీలన కొనసాగుతోంది. డీఈఓ ఆర్.బాలాజీరావు పర్యవేక్షణలో డిప్యూటీఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలతో పాటు డిప్యూటీ తహసీల్దారు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, డిసేబుల్డ్ వెల్ఫేర్ శాఖల అధికారులు, గురుకుల విద్యాలయాల ప్రతినిధులు బృందాలుగా హాజరై అభ్యర్థుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 39, హిందీ 18, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్‌ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115 కలిపి మొత్తం 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లీష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు భర్తీ చేయనున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తాను. ఆ తర్వాతే తుది అభ్యర్థుల జాబితాలను విడుదల చేయనున్నారు. ఈ జాబితా వచ్చిన అనంతరం ఆభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందచేస్తారు. మొత్తం మీద డీఎస్సీ ఉద్యోగ నియామకాలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కావడంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

దివ్యాంగ అభ్యర్థులకు...

అర్హత పత్రాలు పరిశీలకు వీఆర్ ఐపీఎస్ ప్రాంగణంలో హాజరైన దివ్యాంగ అభ్యర్థులు శుక్రవారం జీజీహెచ్‌లోని మెడికల్ సూపరింటెండెంట్ ముందు హాజరై వారి దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించుకోవాలని డీఈఓ తెలిపారు. పరిశీలన అనంతరం వివరాలను విద్యా శాఖ అధికారులకు అందచేయాలన్నారు. అలాగే శుక్రవారం వీఆర్ ఐపీఎస్‌లో పరిశీలనకు హాజరయ్యే దివ్యాంగ అభ్యర్థులు 30న జీజీహెచ్‌లో హాజరై పరిశీలన చేయించుకోవాలని తెలిపారు.

విద్యుత్ కోతలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

• పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం

- వివరాలు 8లో..

హరిత వికాసానికి అడుగులు

• జిల్లాలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకం

• నర్సరీల్లో 20.65 లక్షల మొక్కలు సిద్ధం

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భూ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలనేది కేంద్ర అటవీ శాఖ మార్గదర్శకాలు. ఇందుకు అనుగుణంగా అటవీ విస్తీర్ణం పెంపుపై ఆ శాఖ దృష్టి సారించింది. జిల్లావ్యాప్తంగా సుమారు 2.40 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉండగా, అక్రమంగా కలప తరలించడం, పరిశ్రమలకు భూములు కేటాయించ డంతో ఆ విస్తీర్ణం తగ్గుతోంది. గత వైసీపీ ప్రభుత్వం మొక్కలు నాటినా వాటిని సంరక్షించపోవడంతో ఎండిపోయి ప్రజాధనం వృథా అయ్యింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హరితాంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టి పచ్చదనం పెంపుపై దృష్టి సారించింది. ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట, నివాసాలు, అటవీ శాఖ ప్లాంటేషన్లలో మొక్కలు పెంచాలని నిర్ణేంచి ఆ దిశగా హరిత వికాసానికి అడుగులేస్తోంది.

960.48 హెక్టార్లలో మొక్కల పెంపకం

జిల్లాలో ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, నెల్లూరు, నెల్లూరు రూరల్ అటవీ శాఖ కార్యాలయాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 960.48 హెక్టార్లలో మొక్కలు పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీల్లో 20.65 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో సుమారు 100 హెక్టార్లలో మొక్కలు నాటారు. మిగిలిన చోట కూడా మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ శాఖ నిధులతో ఈ మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు.



లక్ష్యం పూర్తి చేస్తాం

జిల్లాలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకమే లక్ష్యం. ఇటీవల వర్షాలు కురవడంతో 100 హెక్టార్లలో మొక్కలు నాటాం. ఇప్పటికే మొక్కలు నాటేందుకు ప్లాంటేషన్‌లను సిద్ధం చేశాం. నర్సరీల్లో మొక్కలు సైతం సిద్ధంగా ఉన్నాయి. అక్టోబరు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

- మహబూబ్‌బాషా, జిల్లా అటవీ శాఖాధికారి

షార్ట్ సర్క్యూట్‌తో వాహనాల దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి) బుచ్చిపట్టణం సమీపంలోని బుచ్చి జొన్నవాడ మార్గంలో చెల్లాయపాళెం డొంక వద్ద పార్కు చేసివున్న రెండు టెంపో వ్యాన్లలోంచీ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో రెండు వ్యాన్లు దగ్ధమైన సంఘటన బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9636
వెండి కిలో ధర	రూ. 119800
వెండి ఒక గ్రాము	రూ. 122.80



రాయితీలు సద్వినియోగం చేసుకోండి!

హరికరుణాకర్‌రెడ్డి, వ్యవసాయాధికారి, వెంకటాచలం

వెంకటాచలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలు, రాయితీలను రైతులు సద్వి నియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డీ హరి కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

?. మండలంలో ఎంతమంది రైతులు పథకాలు పొందారు.

!. రాష్ట్ర ప్రభుత్వం అందించిన అన్నదాత సుఖీభవ పథకం 5873 మంది రైతులకు అందగా, కేంద్ర ప్రభుత్వం అందించిన పీ ఎం కిసాన్ పథకం 5171 మంది రైతులకు అందాయి.

?. భూసార పరీక్షలు వల్ల ఎలాంటి ప్రయోజనాలుంటాయి

!. భూసార పరీక్షలతో భూమికి, మొక్కకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలను నిర్ధారించుకుని అందించడం ద్వారా అధిక దిగు బడులు సాధించవచ్చు. క్షేత్ర స్థాయిలో రైతులకు భూసార పరీక్షలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. భూసార పరీక్ష చేయిం చుకోవడం వల్ల రైతులకు ఖర్చు తగ్గి లాభం ఎక్కువ వస్తుంది.

?. భూసార పరీక్ష కార్డులు వచ్చాయా..! ఎప్పుడు ఇస్తారు.

!. మండలంలో ఏడాదికి గాను 1470 మట్టి నమూనాలు తీసి పంపాం. ఇంకా ఫలితాలు రాలేదు. సెప్టెంబరు 15లోగా వస్తాయి. రాగానే రైతులకు అందజేస్తాం.

?.. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులు ఏమడుగుతున్నారు

!.. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ముఖ్యంగా రైతులు వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, జింకు, జిప్సమ్ సబ్సిడీ కింద ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.


ప్రతిభకు మూల్యాంకనం!

- తెల్లకాగితాల్లో రాతలకు స్వస్తి
- ఇక..పుస్తకాల్లోనే జవాబులు

మనుబోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గతంలో యూనిట్ (ఎఫ్ఏ) పరీక్షల నుంచి వార్షిక పరీక్షలు వరకు విద్యార్థులు తెల్లకాగితాల్లో రాసేవారు. ఆ తెల్లకాగితాల కోసం అంగళ్లకు వెళ్లి పోటీపడేవారు. కూటమి ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. ఇక పరీక్షలంటే విద్యార్థులు తెల్లకాగితాలు తీసుకురావాల్సిన అవసరం లేదు. వాటికోసం దుకాణాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. విద్యార్థుల ప్రతిభను సులువుగా గుర్తించేందుకు సబ్జెక్టుల వారీగా మూల్యాంకన పుస్తకాలు దోహదపడ నున్నాయి. పుస్తకాలు ఇచ్చే సమయంలోనే విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా మూల్యాంకన పుస్తకాలను సరఫరా చేసింది. ఏడాదిలో నిర్వహించే పరీక్షల జవాబులన్నీ ఆ మూల్యాంకన పుస్తకంలోనే రాయాల్సి ఉంటుంది.

● విద్యార్థి భవిష్యత్తు పుస్తకంలోనే..

ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి భవిష్యత్తును పరీక్షవారీగా ఎప్పటికప్పుడు మూల్యాంకనం పుస్తకంలో నిక్షిప్తం చేస్తారు. ఆ పుస్తకంలోనే గణితం సబ్జెక్టుకు సంబంధించి గ్రాఫ్‌లు ఉంటాయి. అలాగే సాంఘిక శాస్త్రం మ్యాప్‌లు ఉంటాయి. ఇక ఓఎంఆర్ షీట్లు ఆ పుస్తకంలోనే.. ఇలా ఆ పుస్తకం తెరిచి చూడగానే ప్రతి విద్యార్థి ప్రగతి అందులోనే అర్థమవుతుంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎప్పుడైన తనిఖీల సమయంలో పాఠశాలలో ఆ మూల్యాంకనాలు తిరగేస్తే పిల్లల ప్రతిభాపాటవాలు ఇట్టే తెలిసిపోతాయి. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి 4 ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు, 2 సమ్మెటివ్ పరీక్షలు రాయాల్సి ఉంది. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పేపర్ 1,2,3,4గా నిర్ణయించారు. ఇప్పటికే తొలి ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షను కొత్త విధానంలో రాయించారు.



మూల్యాంకనం పుస్తకంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

● తరగతుల వారీగా ...

రెండోతరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా మూడు మూల్యాంకన పుస్తకాలు అందించారు. 3నుంచి 5వతరగతి విద్యార్థులకు నాలుగు, ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ఆరు, 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు 7 మూల్యాంకన పుస్తకాలు ఇచ్చారు. ఏడాది మొత్తంలో జరిపే పరీక్షల జవాబులన్నీంటిని ఈ పుస్తకాల్లోనే రాయాల్సి ఉంటుంది. ఆయా పుస్తకాలను భద్రపరిచే బాధ్యత సంబంధిత సబ్జెక్టుల టీచర్లదే. గతంలో పేపర్లపై మార్కులు నమోదు తో ఉపాధ్యాయుల బాధ్యతతీరేది. ఇప్పుడు మూల్యాంకనం పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి లేదు. వాటిని భద్రపరచడం తలకు మించిన భారమని కొంతమంది ఉపాధ్యాయులు అంటున్నారు. పరీక్షలు రాసిన తరువాత ఓఎంఆర్ షీట్లో మార్కులు వేయాలి. ఆ ఓఎంఆర్ షీట్లను విద్యాశాఖ ఇచ్చిన యాప్‌లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలి. విద్యాశాఖ కొత్త సంస్కరణపై ఉపాధ్యాయులు కొంతమంది అసంతృప్తిగా ఉంటే, మరికొంతమందేమో స్వాగతిస్తున్నారు. విద్యార్థులు సైతం కాగితాల్లో అయితే ఇచ్చిన ప్రశ్నకు జవాబు రాసేందుకు చాలా ఖాళీ ఉంటుంది. అంతేకాదు ఒకవేళ తప్పురాస్తే, దాన్ని సరిదిద్దుకోవచ్చు. కానీ మూల్యాంకనంలో ఇచ్చిన స్థలం కొంతే ఉంటుంది. అది సరిపోవడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

కోవూరు ఏజీపీగా సలీమ్



సలీమ్

కోవూరు, ఆగస్టు 28, (ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టులో ప్రభుత్వ న్యాయ వాదిగా పని చేస్తున్న సలీమ్‌ను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు (ఏజీపీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయ విభాగ కార్యదర్శి ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీ చేశారు. కోవూరు బార్ అసోసియేషన్‌కు చెందిన సలీమ్ ఏజీపీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను అభినందించారు.

దుకాణాలను హద్దుల్లో పెట్టండి

పొదలకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పంచాయతీ బస్టాండులో దుకాణాల యజమానులు తమ హద్దులు మీరి ముందుకు వచ్చి పక్క దుకాణదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేపీ నాయకులతో పాటు పలువురు దుకాణదారులు గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు పూల ప్రశాంత్ మాట్లాడుతూ బస్టాండులో మొత్తం 150 దుకాణాలు ఉండగా అందులో సుమారు 100 దుకాణదారుల యజమానులు బాడుగకు ఇచ్చి ఉన్నారని తెలిపారు. మరుగుదొడ్లకు వెళ్లాలన్నా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఓ బొజ్జ గణపయ్యా.. రక్షించ రావయ్యా!

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు



పొదలకూరులో నంది వాహనంపై గణేశుడు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీతో పాటు, మండలవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పలుచోట్ల గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. సాల్మానుపురంతోపాటు పలు గ్రామాలలో గణేష్ విగ్రహాల వద్ద ఉట్టి కొట్టారు. ఇళ్ళలో వినాయకుడి ప్రతిమలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించారు. మారేడు, జిల్లేడు దళాలతో పూజలు చేశారు. రాత్రి గ్రామోత్సవంలో బొజ్జ గణపయ్య భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఏవీ.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. బుచ్చిలోని 11వవార్డు పరిధిలోని సిండికేట్ బ్యాంకు వీధిలో కౌన్సిలర్ రాచూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో హౌస్‌తోట యూత్ గణేష్ కమిటీ ఏర్పాటు చేసిన ఊంజల్ వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కోవూరు: వినాయయచవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. గణనాధునికి విశేషపూజలు చేశారు. స్థానిక టీఎస్‌సీ కూడలిలో ఏర్పాటుచేసిన వినాయకుని ప్రతిమ ఆకట్టుకుంటోంది. శాంతినగర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలోని వినాయక ప్రతిమకు ఆలయ అర్చకుడు జనార్దనం నాగరాజాచార్యులు పూజలు చేశారు. పురాతన వినాయకస్వామి ఆలయంలో పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేశారు. వినాయక ప్రతిమల్ని శనివారం నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు కార్యక్రమాల్ని రూపొందించుకుంటున్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని అన్నీ గ్రామాలలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వాడవాడలా, ప్రధాన కూడళ్లలో ఇంటింటా గణపతులను ప్రతిష్ఠించి ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ముత్తుకూరు : సీవీఆర్ రామలింగాపురం యువత భారీ శోభాయాత్ర నిర్వహించి విగ్రహాన్ని కృష్ణపట్నం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. సముద్ర తీరంలో నిమజ్జనం కోసం కృష్ణపట్నం ఎస్ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వినాయక మండపాలు విద్యుత్ దీపాలతో మెరిసిపోయాయి. వినాయకుడి ఆశీర్వాదంతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని స్థానిక ప్రజాప్రతినిదులు వినాయక మండపాల్లో పూజల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ముత్తుకూరులో మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ నారికేళపల్లిలో బీజేపీ అధ్యక్షులు సంపత్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రాపూరు: రాపూరు మండలవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. బుధవారం పట్టణంలోని సిద్దలయ్య సెంటర్, కొత్తపేట, శివాలయం, ఫ్రెండ్స్ మెస్ వద్ద గణేష్ మండపాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రెండో రోజు గురువారం కొత్తపేట, లక్ష్మీపురం విగ్రహాల వద్ద అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

సైదాపురం : మండల పరిదిలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వినాయక స్వామి ప్రతిమలను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ కాంతి కుమార్ పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. తిక్కవరప్పాడు వైపు నుంచి గొలగమూడికి వెళ్లే మార్గంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మోటర్ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. క్షతగాత్రుడిని గొలగమూడిలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● కాలువలోకి దూసుకెళ్లిన కారు

మండలంలోని కసుమూరు సమీపంలోని పాలిచెర్లపాడుకు వెళ్లే మార్గంలో కనుపూరు కాలువ లోకి కారు దూసుకెళ్లింది. కసుమూరు దర్గాను దర్శించుకున్న ఓ కుటుంబం ఆ తర్వాత ఏఎస్ పేట దర్గాకు వెళ్లేందుకు కారులో బయలుదేరింది. పాలిచెర్లపాడు మార్గంలో కనుపూరు కాలువలోకి పల్టీ కొట్టింది. దీంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి

వెంకటాచలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు - గొలగమూడి గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తిక్కవరప్పాడు పంచాయతీ మంగళంపాడు గిరిజన కాలనీకి చెందిన చెలంచర్ల ప్రసాద్ (27) మోటార్ బైకుపై గొలగమూడికి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆటో డ్రైవర్...

మనుబోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ మిర్ మహ్మమద్ రజా (54) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని జాతీయరహదారిపై వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కాగితాలపూరుకి చెందిన మిర్ మహ్మమద్ రజా గత కొంతకాలంగా ఎలక్ట్రిక్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో పాటు బేల్దారి మేస్త్రీగా పనులకు వెళుతుంటాడు. బుధవారం సాయంత్రం ఆటోలో నెల్లూరుకు వెళ్ళి వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆటో రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి వస్తున్న బొలెరో ఆటోను ఢీకొంది. దీంతో రజాకు తీవ్ర గాయాలు కాగా, నెల్లూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మీర్జా మహ్మద్ బేగం భర్త చనిపోవడంతో కన్నీరు, మున్నీరుగా విలపిస్తోంది. ఎస్ఐ శివరాకేష్ హైవే పోలీసులను అప్రమత్తం చేశారు. బొలేరో వాహనాన్ని, డ్రైవర్‌ను కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, ఇస్రో, అంతర్జాతీయ సంస్థలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు గురువారం వీసీ బహుమతులను అందజేశారు. అంతరిక్షం అనేది మానవ జ్ఞానానికి సవాలు విసిరే రంగమని వీసీ పేర్కొన్నారు. భవిష్యత్ తరం శాస్త్రవేత్తలు ఈ క్షేత్రంలోకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉపగ్రహ వ్యవస్థలు, రిమోట్ సెన్సింగ్, కమ్యూనికేషన్ సాంకేతికతలు మాత్రమే కాకుండా అంతరిక్ష అన్వేషణ మన భూగోళ భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయన్నారు. ప్రస్తుతం అంతరిక్ష పరిశోధన వ్యవసాయం, వాతావరణ సూచన, విపత్తుల నిర్వహణ, రక్షణ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థులు ఈ రంగంలో పరిశోధన చేయడానికి మరింత చురుకుగా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ శివశంకర్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎన్ఓ గోపాల్, సుబ్బారెడ్డి, సీడీసీ డీన్ డాక్టర్ ఎం హుస్సేనయ్య, డాక్టర్ వై విజయ, డాక్టర్ శ్యాం భగవాన్, డాక్టర్ రాజం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే కురుగొండ్ల



చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే

సైదాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ రాష్ట్రాన్ని అభి వృద్ధి పథంలో నడుపుతున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో గురువారం పీఏసీఎస్ అధ్యక్షుడిగా అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, సభ్యులుగా ఎస్‌కే చాంద్ ఖాసీం, పొట్టేళ్ల రామయ్యల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పొట్టిశ్రీరాములు, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పరిశీలకుడు జెన్ని రమణయ్య, డీసీఎంఎస్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు, రాపూరు ఏఎంసీ చైర్మన్ ఆవుల వాణి, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, మండల టీడీపీ రైతు అధ్యక్షుడు కేపీ రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి యువకుడి బలి



ఉప్పల ప్రశాంత్ (ఫైల్)

ఇందుకూరుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి ఓ యువకుడు బలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని లేబూరు గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలను తిలకించేందుకు మిద్దెపైకి ఎక్కిన ఉప్పల ప్రశాంత్ (21) 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో మృతి చెందాడు. రక్షించబోయిన శారదమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడి నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ప్రశాంత్, తండ్రి ఉప్పల పెంచలయ్య ఇద్దరూ హెచ్‌పీ గ్యాస్ డెలివరీ బాయ్‌లుగా జీవనం సాగించేవారు. తండ్రి పెంచలయ్య ఆరు మాసాల కిందట చనిపోవడంతో కుటుంబ భారమంతా ప్రశాంత్ మీదే పడింది. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తల్లి హజరత్తమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో వినాయక చవితి రోజు యువకుడు చనిపోవడంతో లేబూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 11కేవీ విద్యుత్ వైర్లు నివాసాల మధ్య రబ్బర్ స్లీవ్ లేకుండా ఏర్పాటు చేశారని, ఎన్నిసార్లు విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోనే లైన్ ఇన్‌స్పెక్టర్, జేఎల్ఎం స్థానికంగా నివాసం ఉండాలి. సబ్‌స్టేషన్‌లో ఉండే వాచ్‌మెన్‌కి పూర్తి బాధ్యతలు అప్పజెప్పి వీరు వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు.

రావి ఆకులపై చిత్రాలు భలే!



రావి ఆకుపై గిడుగు రామ్మూర్తి



మేజర్ ధ్యాన్‌చంద్

మనుబోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు పండుగలు, జాతీయ పండుగలు, మహానుభావులు, స్వాతంత్ర సమరయోధుల జన్మదినాలకు ముందస్తుగా రావి ఆకులపై అబ్బురపరిచే చిత్రాలు గీసి ప్రదర్శిస్తుంటారు వీరంపల్లి తెలుగు పండిట్ సోమా పద్మారత్నం. ఈక్రమంలోనే శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం కావడంతో తెలుగుభాషా కోవిదుడు గిడుగు రామ్మూర్తి చిత్రాన్ని, అలాగే హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి కావడంతో ఆయన చిత్రాలను ఇదిగో ఇలా రావి ఆకులపై గీసి, వాటికి రంగులు అద్ది వాళ్లకు నివాళులు తెలియజేశారు పద్మారత్నం. వీటిని గురువారం వీరంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రదర్శించారు.



రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

జిల్లావ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. మరికొంతమంది గాయాలపాలయ్యారు.

● గుర్తుతెలియని వాహనం ఢీకొని..



రసూల్ మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు పాడు జాతీయ రహ దారిపై మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మున్సిపల్ బిల్ కలెక్టర్ షేక్ రసూల్(53) మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని జెండావీధికి చెందిన రసూల్ 35 ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య ముజీబా మనస్పర్థలతో పదేళ్లుగా వేరుగా ఉంటున్నారు. ఇద్దరు కుమారులతో రసూల్ తన తల్లి వద్ద ఉంటున్నారు. ముజీబా కుమార్తెతో వేరుగా ఉంటోంది. మద్దూరుపాడు టిడ్కో ఇళ్లల్లో ఉంటున్న స్నేహితుడు సికిందర్ వద్దకు వెళ్లిన రసూల్ ఆత్మకూరుకు వెళ్లాలని కావలి వచ్చేందుకు రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రసూల్‌ను హైవే అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు అల్తాఫ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● సిమెంట్ ట్యాంకర్ ఢీకొని...



మృతి చెందిన చక్రి

ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు, ముంబాయి జాతీయ రహదారిపై కొండమీద కొండూరు క్రాస్‌రోడ్డు సమీపంలో సిమెంట్ ట్యాంకర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. సంగం మండలంలోని కోలగట్ల హరిజనవాడకు చెందిన కల్లూరు చక్రి (19) వరి కోత యంత్రానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మోటారుబైక్‌పై ఆత్మకూరు వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● వింజమూరులో ఇద్దరు



విష్ణువర్ధన్‌రెడ్డి

వింజమూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపడియ గ్రామం సమీ పంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద బుధ వారం మధ్యాహ్నం లారీ, బైక్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న దేవల్ల పవన్ కుమార్ మృతిచెందాడు. ఫ్యాక్టరీలో పని చేస్తూ పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా ఈప్రమాదం జరిగింది. ఇతని స్వగ్రామం దుత్తలూరు మండలంలోని తురకపల్లి గ్రామం. అలాగే బుధవారం రాత్రి నందిగుంట గ్రామ సమీపాన వేగంగా వెళ్తున్న మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడడంతో విష్ణువర్ధన్‌రెడ్డి (25) మృతి చెందగా, బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి గాయాలు కాగా, వారు నెల్లూరులో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఇసుక టిప్పర్

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద 167-బీజీ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఇసుక టిప్పర్ ఢీకొన్న సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకొంది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంగం ఇసుక రీచ్‌లో ఇసుక లోడు చేసుకుని ప్రకాశం జిల్లా డీజీపేటకు వెళుతున్న టిప్పర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే రహదారిపై ఒక్కసారిగా గేదెలు అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది.

వ్యాను, ఆటో ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బుచ్చి-జొన్నవాడ మార్గంలో బుధవారం ఉదయం నెల్లూరునుంచి బుచ్చివైపు వెళ్తున్న ఓ ఆటో ఓ టాటా మేజిక్ వ్యానును ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవరు ఏడుకొండలుతోపాటు, తల్లి ఆమె కుమారుడు, ఆటో డ్రైవర్ వినోద్, భార్య రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు.

పిడుగుపాటుకు గృహోపకరణాల దగ్ధం

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మకాలనీ అట్టల ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి పిడుగుపాటుకు ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయని ఆ ప్రాంత వాసులు పేర్కొన్నారు. అర్ధరాత్రి వర్షంతోపాటు పెద్ద శబ్దంరావడం, విద్యుత్ హెచ్చుతగ్గులు వచ్చి కాలనీలోని మాదాల వెంకటేశ్వర్లు, కంచర్ల సురేష్, మాతయ్య ఇళ్లలోని ఫ్యాన్లతోపాటు పలువురి ఇళ్లల్లోని టీవీలు కూడా కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అక్క మృతిపై అనుమానం.. చెల్లెలి ఫిర్యాదు



విజయలక్ష్మి మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరులో ఉంటున్న తన అక్క గొట్టిపాటి విజయ లక్ష్మి(59) మృతిపై అనుమానం ఉందని నెల్లూరు బీవీ నగర్‌లో ఉంటున్న స్వర్ణ రాధిక గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, ముసునూరు కమ్మపాలెంలో ఉంటున్న గొట్టిపాటి వెంక టేశ్వర్లు, బోగోలు మండలం బుర్రోడుపాలెంకు చెందిన విజయ లక్ష్మికి 40 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కుమార్తెలు కిరణ్మయి, స్వర్ణ లత. వారివురికి పెళ్లిళ్లు చేశారు. అయితే ఈనెల25న విజయలక్ష్మికి ఆరోగ్యం సరిగాలేదని, వచ్చి చూసుకోమని ఆమె ఆరుగురి చెల్లెళ్లకు వెంక టేశ్వర్లు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె చెల్లెళ్లలో ఒకరైన అన్నమ్మ అదేరోజు వచ్చి వెళ్లగా, ఈనెల 26న మిగిలిన చెల్లెళ్లు అయిన విజయమ్మ, కమలమ్మ, శోభ, శ్రావణి, రాధిక ముసునూ రులోని అక్క ఇంటికి వచ్చారు. వారిలో అదే రోజు కమలమ్మ, శ్రావణి వెళ్లిపోగా, విజయమ్మ, శోభ, రాధిక 27 రాత్రి వరకు ఉండి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున విజయ లక్ష్మి మృతి చెందిందని వెంకటేశ్వర్లు మళ్లీ ఆమె చెల్లెళ్లకు ఫోన్ చేశా డు. దీంతో వారు వచ్చి చూసి అక్క మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి చెల్లెలు రాధిక ఫిర్యాదు మేరకు విజయలక్ష్మి మృత దేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కావలి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు

వైసీపీ నేతపై కేసు

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నెల్లూరుకి చెందిన వైసీపీ నేత తౌసిక్‌పై గురువారం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు, ఈనెల 26న ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి నెల్లూరులో పెట్టిన ప్రెస్ మీట్‌కు కౌంటర్‌గా, ఈనెల 27న నెల్లూరులో తౌసిక్ ప్రెస్ మీట్ పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై కావలి 29వవార్డు జనసేన ఇన్‌చార్జి సిద్దవరపు జానీ ఫిర్యాదుతో ఎస్ఐ జమాల్‌వల్లీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
కోడిగుడ్ల ధర (100): 555	



వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట గురునిలయంలో గొలగమూడి వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి నామ సంకీర్తనలతో నగర బిక్షాటన కార్యక్రమం జరిగింది. రాత్రి సత్సంగం జరిగింది. శుక్రవారం ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు ఆరాధన కార్యక్రమాలు జరగనున్నాయి.

అటకెక్కుతున్న ఆటలు

- ప్రగతి లేని క్రీడారంగం
- ప్రణాళిక లేని పాఠశాలల క్రీడలు..
- ప్రాధాన్యత తెలియని యువత
- పట్టించుకోని పాలకులు, యంత్రాంగం
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

నెల్లూరు(విద్య), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజైన ఆగస్టు 29వ తేదీని ఏటా జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ. అయితే నేటికీ అత్యధిక శాతం మంది యువతకు ఈ క్రీడాదినోత్సవం ప్రాధాన్యత ఏమిటో తెలియదు. ఏ రోజున.. ఎందుకు జరుపుకుంటారో తెలియని వారు కూడా ఉన్నారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం క్రీడలను మాత్రం చిన్నచూపు చూస్తోంది. ఫలితంగా ఔత్సాహిక, ప్రతిభావంత క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. క్రీడారంగంపై వైసీపీ ప్రభుత్వంలో ఉన్న నిర్లక్ష్యమే నేటికీ కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రీడామండలిలో కరువైన ప్రగతి....

క్రీడలకు పెద్ద పీట అన్న ప్రకటనలు, వాగ్దానాలతోనే ప్రభుత్వాలు ఏళ్లు గడిపేస్తున్నాయి. అనేక క్రీడాంశాల్లో శిక్షకులు లేక, మౌళిక వసతులు కరువై, విద్యా విధానంలో మార్పులతో ఆటలకు ఆదరణ తగ్గిపోతోంది. క్రీడారంగానికి పెద్ద దిక్కయిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిపాలనా పరమైన అంశాలకే పరిమితమవుతోంది. గతంలో అన్ని విభాగాలకు శిక్షకులు అందుబాటులో ఉన్న క్రీడామండలిలో నేడు కొన్ని విభాగాలకే కోచ్‌లు ఉన్నారు. వీరిలో కూడా అత్యధికంగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేసే వారే ఉండటం గమనార్హం. అధికారుల నిర్లిప్తత, ప్రజాప్రతినిధుల అలక్ష్యం వెరసి క్రీడలు ప్రగతికి నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్‌కు, వివిధ సంఘాల సమావేశాలకు వేదిక అవుతోంది. క్రీడాకారులు మా త్రం నామమాత్రంగానే హాజరవుతున్నారు.

నేడు హాకీ పోటీలు

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి 5ఏ సైడ్ ఓపెన్ హాకీ లీగ్ పోటీ లు నిర్వహిస్తున్నట్లు హాకీ ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా కార్యదర్శి పీ జగన్ మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు పోటీలకు హాజరు కావాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.



ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం (ఫైల్)


ప్రణాళికలేని పాఠశాల క్రీడలు..

ఆటలకు పునాది పాఠశాలల్లోనే అన్న విషయాన్ని అందరూ ఒప్పుకోవాల్సిందే!. కానీ విద్యారంగంలో పెరిగిన పోటీ, కార్పొరేట్ కలుషితం, సరైన ప్రణాళిక లేకపోవడం తదితర కారణాలతో బడిలో ఆటలు నానాటికీ కనుమరుగవుతున్నాయి. దీనికితోడు నిధుల కొరతతో పాఠశాల క్రీడలు కొట్టుమిట్టాడుతున్నాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయక పోవడంతో ఆటలు అటకెక్కుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రతిభను పరీక్షించ కుండానే క్రీడా జట్లను ఎంపిక చేసి పోటీలకు పంపుతున్నారు. ఈ క్రమంలో క్రీడా సంఘాల కార్యదర్శులు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారుతోంది. ఇప్పటికైనా ఇటు అధికారులు, అటు పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాల క్రీడా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

తేనెల తెలుగు.. జాతికి వెలుగు

- కమ్మని బాస... ఆంధ్ర భాష
- మసకబారుతున్న మన నుడి...
- కాపాడుకోవడం అందరి బాధ్యత
- నేడు తెలుగు భాషా దినోత్సవం

ఏ జాతి అయినా మనుగడ సాగించాలంటే దానికొక భాష ఉండాలి. మన తెలుగుజాతికి, తెలుగు భాషకు ఎనలేని ఖ్యాతి ఉంది. తేనెల భాషగా, అన్నింటిలోకీ లెస్సగా గుర్తింపు పొందింది. అయితే తరాలు మారేకొద్దీ ఆధునిక పోకడల ప్రవేశంతో అమ్మభాష అష్టకష్టాలు పడుతోంది. కాన్వెంట్ల హోరులో మన బడి.. నుడి మసకబారుతున్నాయి. మమ్మీ.. డాడీ మాటలతో 'అమ్మా.. నాన్న'లు వెనుకబడిపోయాయి. పేరుకే తెలుగు వాళ్లం అని కాకుండా అచ్చ తెనుగును అన్ని వేళలా ఉచ్చరిస్తూ ఆంధ్ర భాషను సజీవంగా నిలుపుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పరభాషా వ్యామోహంతో తెలుగు వాళ్లు మాతృభాషను మృత భాషగా మారుస్తున్నారు. పాలకులు కూడా భాషా పరిరక్షణ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఉత్తర ప్రత్యుత్తరాలు, న్యాయస్థానాల ఉత్తర్వులు... ఇలా అన్నింటా తెలుగు భాషనే అమలు చేస్తామన్న పాలకుల వాగ్దానాలు నీటి మూటలవుతున్నాయి. కాగా, 1966లో తెలుగును అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించింది. 2008లో ప్రాచీన భాషగా గుర్తించింది. దేశంలో హిందీ, బెంగాలీ తర్వాత అత్యధికులు మాట్లాడే భాష తెలుగే!. పాఠ్యాంశాలు, చట్టాలు అన్నీ వాడుక భాషలోనే జరగాలని గిడుగు వెంకట రామమూర్తి పంతులు పోరాడారు. ఆయన జయంతిని ప్రతీ ఏటా తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. తెలుగు వికాసానికి కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు తదితరులు ఎంతో కృషి చేశారు. పద్యం, గద్యం, నాటకం, కవితలు, నవలలు, అష్టావధానం, ఎన్నో భాషా ప్రయోగాలు తెలుగువారి సొంతం. ఇలాంటి వాటికి గతంలో రాజులు, జమీందారుల పోషకులుగా ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమే పోషణ, పరిరక్షణ చూడాల్సి ఉండగా అది పట్టించుకోకపోవడం వలన పద్య నాటకాలు కనుమరుగవుతున్నాయి. అవష్టావధానాల జాడ కన్పించడం లేదు.

నేటి నుంచి భాషోత్సవాలు

గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా నెల్లూరు రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో శుక్ర, శని వారాల్లో తెలుగు భాషోత్సవాలు భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు సేవ, తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ, వ్యవస్థాపకుడు కంచర్ల సుబ్బానాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు భాషోత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం ప్రాచీన సాహిత్య సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్, అప్పాజోస్యుల సత్యనారాయణ, కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు.

తెలుగును కాపాడుకోవడం మన బాధ్యత

తెలుగే మన వెలుగు. తెలుగు భాష గొప్పదనం వెలకట్టలేనిది... ఆ భాష సొంపు అనంతం. అటువంటి భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది. పాఠశాలలో 5వ తరగతి వరకైనా నిర్బంధ తెలుగు మాధ్యమం అమలు చేయాలి. 10వ తరగతి వరకు ఉభయ మాధ్యమా ల్లో బోధించాలి. అప్పుడే మన తెలు గు భాషకు పూర్వ వైభవం వస్తుంది.

\- ఆలూరి శిరోమణిశర్మ

న్యూస్ బాక్స్

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయాలైన వృద్ధురాలు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల సమాచారం మేరకు నగరంలోని ఎంవీ అగ్రహారంలో సుబ్బయ్య శాస్త్రి, భాగ్యలక్ష్మి(70) దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల 23న వివాహిత ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. తీవ్రగాయాలపాలైన ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం నారాయణ వైద్యశాలలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ 26వ తేదీన ఆమె మృతి చెందారు. బుధవారం భర్త చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఐఎఫ్ఎస్ అధికారిపై మహిళ దాడి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం మాయన్మార్ దేశంలో భారత రాయబార కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌గా విధులు నిర్వహిస్తున్న బుడిగి శ్రీనివాసులు, ఆయన తల్లిపై ఓ మహిళ గురువారం దాడి చేసింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని బీవీనగర్‌లో శ్రీనివాసులు కుటుంబం నివసిస్తోంది. ఆయన పుట్టుకతో అంధుడు. స్వయం కృషితో మొట్టమొదటి బ్లైండ్ ఐఎఫ్ఎస్‌లో నియమితులయ్యారు. ఇంటి వద్ద ఉన్న 80 ఏళ్ల తల్లి, ఇద్దరు చిన్న పిల్లలకు సంరక్షకురాలిగా పాలకొలను రేణుక అనే మహిళను నియమించారు. ఇంటికి కావాల్సిన ఖర్చులకు శ్రీనివాసులు నేరుగా రేణుక బ్యాంకు అకౌంట్‌కు నగదు వేసేవారు. శ్రీనివాసులు బుధవారం ఇంటికి చేరుకున్నారు. రేణుక ఇంట్లోకి చొరబడి ఇనుపరాడ్డుతో శ్రీనివాసులు, అతని తల్లిపై దాడి చేసింది. శ్రీనివాసులు మేనల్లుడు వెంకటేశ్వర్‌రెడ్డి వారిని కాపాడాడు. బాధితుల ఫిర్యాదుతో వేదాయపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఈఈగా నారాయణరావు



నారాయణ రావును శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ నెల్లూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బీ నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నరసారావుపేటలో పని చేస్తున్న ఆయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు. రూరల్ పరిధిలోని కొత్తూరు అంబాపురంలో ఉన్న ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు టౌన్ ఈఈ ఎం శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో నిరక్షరాస్యుల గుర్తింపు

- కార్పొరేషన్ డీడీ మాధురి

నెల్లూరు(సిటీ), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గుర్తించనున్నట్లు అమృత పథకం నెల్లూరు కార్పొరేషన్ డీడీ మాధురి తెలిపారు. గురువారం కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. నగరంలో డివిజన్ల వారీగా నిరక్షరాస్యుల ను గుర్తించాలని సూచించారు. వారి వివరాలు ఉల్లాస్ యాప్‌లో నిక్షిప్తం చేయాలని తెలిపారు. తద్వారా వయోజన విద్య, అందుకు తగిన శిక్షణ అందించనున్నామన్నారు. దీక్ష పోర్టల్‌ను అందుబాటులో తీసుకువస్తున్నట్లు తెలిపారు. మెప్మా ద్వారా ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకులుగా మారిన ప్రజల నుంచి స్వచ్ఛందంగా బోధన అందించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ మాధురి

విద్యుత్ ఉద్యమానికి 25 ఏళ్లు

- అమరులను స్మరించుకుంటూ ప్రతిజ్ఞ : సీపీఎం

నెల్లూరు రూరల్, ఆగస్టు 28,(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థల్లో సంస్కరణలను వ్యతిరేకిస్తు బషీర్‌బాగ్ వద్ద నిర్వహించిన ఉద్యమంలో ముగ్గురు అమరులైన ఘటనకు 25 ఏళ్లు పూర్తయ్యాయని, సీపీఎం నాయకులు తెలిపారు. గురువారం మండలంలోని దేవరపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ మాట్లాడుతూ నాటి విద్యుత్ ఉద్యమంలో ముగ్గురు అమరులయ్యారన్నారు. వారికి ఘన నివాళి అర్పిస్తూ, నేటి పాలకుల విధానాలను నిరసిస్తూ ప్రతిజ్ఞ దినంగా చేపట్టామన్నారు. స్మార్టు మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలూరు తిరుపాలు, హామాలీ కార్మికులు పాల్గొన్నారు.



దేవరపాళెం సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టిన సీపీఎం శ్రేణులు

క్షయ లక్షణాలుంటే పరీక్షలు తప్పనిసరి

- అదనపు జిల్లా వైద్యాధికారి ఖాజావలి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి తప్పనిసరిగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. గురువారం నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వారాలకు మించి దగ్గు, జ్వరం, గళ్ల పడటం, ఆకలి లేకపోవటం, రాత్రిపూట చెమట పట్టటం, ఆకస్మిక బరువు తగ్గటం వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాల న్నారు. ఆయా ఆసుపత్రులలో క్షయ వ్యాధికి సంబంధించి ఆరు నెలలు ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షయ, హెచ్ఐవీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, పట్టణ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చికిత్సలపై వైద్యులను ప్రశ్నిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వారికి మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు రికార్డులు అప్పగించారు. చైర్మన్‌తోపాటు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రాపూరు చంద్రశేఖర్, డైరెక్టర్లు సాయిలక్ష్మణ్, తుళ్లూరు బాబు, ఈగి సురేష్, గునుకుల విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ మాటాడుతూ మార్కెట్ కమిటీ అధికారుల సహకారంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏసీ మార్కెట్‌కు వచ్చే వినియోగదదారుల హక్కులను తమ కమిటీ కాపాడుతుందని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన వారికి మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు షేక్.అమీర్‌బాయి, కార్యదర్శి షేక్ అజీజ్‌బాయ్, కోశాధికారి కాళహస్తి శ్రీనివాసులు, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.



చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న మార్కెట్ వ్యాపారులు

రంగడి ఆలయ హుండీల ఆదాయం రూ.15.89 లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు జరిగింది. 2025 మార్చి 23 నుంచి 2025 ఆగస్టు 28వరకు రోజులు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.15,89,071 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, ఆలయ ఈవో, రిటైర్డ్ బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఇరుగాళమ్మ గుడిలో...

గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో గురువారం పరకామణి (హుండీలు) లెక్కింపు జరిగింది. 2025 మే 20 నుంచి 2025 ఆగస్టు 28వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.7,79,780 నగదు, 25 అమెరికన్ డాలర్లు, 2 సింగపూరు డాలర్లు కానుకగా వచ్చాయని ఈవో గిరికృష్ణ తెలిపారు. ఈ హుండీల లెక్కింపునకు ఈవో కేవీపీ ప్రసాద్ పర్యవేక్షకులుగా వచ్చారు. కాగా గణేష్ ఘాట్‌లో చిన్న గణపతులను నిమజ్జనం చేస్తున్న భక్తులకు ఆలయం తరఫున ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, పీ చంద్రశేఖర్‌స్వామి, పీ దైవజ్ఞాచార్యులు పాల్గొన్నారు.

- రంగనాథస్వామి ఆలయంలో నిత్యం ఆవు నేతి దీపారాధనకు గురువారం భూపతి విజయనాయుడు దంపతులు రూ.1,10,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.



ఇరుగాళమ్మ గుడిలో హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

పల్సర్ బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పల్సర్ బైక్ చోరీ ఘటనపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని సూర్యప్రకాష్ నగర్‌కు చెందిన శ్రీనివాసులు సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 21న తన పల్సర్ బైక్‌ను ఏకే నగర్‌లోని ఓ స్కూల్ వద్ద పార్క్ చేశారు. పనినిమిత్తం కారులో వేరే ఊరికి వెళ్లారు. మరుసటి రోజు వచ్చి చూడగా బైక్ కన్పించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మోపెడ్ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

వాహనం స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మోపెడ్ చోరీ కేసులో చిన్నబజారు పోలీసులు గురువారం నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రజాక్ నిందితుల వివరాలు మీడియాకు తెలిపారు. సంతపేటకు చెందిన రామకృష్ణ గతేడాది నవం బరులో వీఆర్సీ సెంటర్‌లో తన మోపెడ్‌ను పార్క్ చేసి పని మీద వెళ్లారు. తిరిగి వచ్చేసరికి వాహనం లేదు. దీంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఎస్2 రోడ్డులో వాహన తనిఖీలు చేపడుతుండగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన వంశీ, మహేంద్ర, తిరుపతికి చెందిన జగన్, చిలమత్తూరుకు చెందిన చంద్రమోహన్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా మోపెడ్‌ను దోచుకెళ్లినట్లు, ఎస్2 రోడ్డులో వెళ్లేవారిని కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లేందుకు వచ్చినట్లు తెలిపారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గజాననా.. గౌరీతనయ !

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి
- వీధివీధినా మండపాలు
- సామూహికంగా సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో బుధవారం వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భారీ వ్యయంతో సినిమా సెట్టింగులను తలపించే మండపాలను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపకాంతులు, తపెట్లు, మంగళవాయిద్యాలు డీజే సౌండ్స్ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడంతో మండపాలు, వీధులు విద్యుద్దీపాలతో వెలిగిపోతున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శివాజీ సెంటర్‌తోపాటు మాగుంటలేఅవుట్‌లోని మండపాల్లో పూజలు చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, ఇతర నాయకులు నగరంలోని తాత్కాలిక గణేష్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. బాలాజీనగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద గురువారం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంధ్య దంపతులు ఉట్టి కొట్టి వేడుకను ప్రారంభించారు. నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ప్రశాంతినగర్ పరిసర ప్రాంతాల్లోని గణేష్ మండపాలను సందర్శించారు. శివాజీ సెంటర్ గణేష్ మండపంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, శివాజీ సెంటర్ మిత్రమండలి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మాగుంటలేఅవుట్ లంబోదర సెంటర్‌లోని గణేష్ మండపానికి భక్తులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. ఆ మండపం వద్ద ఏర్పాటు చేసిన కొర్కెల గుంజకు వేలాది మంది పసుపు కొమ్ములు కట్టారు. ఈ మండపాన్ని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకుని పూజలు చేశారు.



వేదగిరి క్షేత్రంలో గణపతికి విశేష అలంకరణ

పల్లెల్లో సందడి

నెల్లూరు రూరల్, ఆగస్టు 28,(ఆంధ్రజ్యోతి) : వినాయచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నెల్లూరు రూరల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వాడవాడలా విఘ్నేశ్వరుని ప్రతిమలు కొలువుతీరాయి. నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి మహోత్సవాలు ఆకట్టుకున్నాయి. కొన్ని ప్రాంతాలలో తొలిరోజు బుధవారమే ఉత్సవ గణపతికి ఉద్వాసన చెప్పగా, మరికొన్ని చోట్ల గురువారం గణేశ నిమజ్జనం జరిగింది. వేదగిరి క్షేత్రంలో తొలిసారిగా గణేష్ ఉత్సవాలను చేపట్టిన ఆలయ అధికారులు యాగశాల వద్ద మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమను ప్రతిష్ఠించారు. 9 రోజులు పూజించి ఆపై ఆలయ కోనేర్లలో విఘ్నేశ్వరుని నిమజ్జనం చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



గణేష్ ఘాట్‌లో నిమజ్జనం..


బుచ్చిలో ఊంజల్ వినాయకుడు


కోవూరులో..


నెల్లూరు : రాణాప్రతాప్ సెంటర్‌లో కొలువుదీరిన 19 అడుగుల కల్కి వినాయకుడు


సంగం : వంగల్లులో


నెల్లూరు : చంద్రమౌళినగర్ 12వ వీధిలో..


ఆత్మకూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేంకటేశ్వరుడిగా..


నెల్లూరు : మినీబైపాస్‌లో లంబోదరుడిగా..




నెల్లూరు నగరంలో ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ


జలదంకి : ఉత్సవ నిర్వాహకులకూ యూనిఫాం


చిన్నారుల ఆనందకేళి : కావలి రూరల్ : బుజ్జి గణపయ్యను చెక్క బండిపై నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు


రాపూరు : సిద్ధలయ్య సెంటర్‌లో


నెల్లూరు : వేదాయపాళెం సెంటర్‌లో..

ఊరూరా.. వెరైటీ గణపయ్యలు!

ఊండ్రాళ్ల పండగంటే ఊరంతా సంబరమే! గణనాథుల రూపం వేరైనా.. భక్తులను రక్షించే మార్గం ఒక్కటే. కోటీశ్వరులకైనా.. కటిక పేదలకైనా విఘ్న వినాయకుడి దర్శన భాగ్యమూ ఒక్కటే! వినాయక చవితి రోజున వీధి వీధిలో వెరైటీ బొజ్జ గణపయ్యలు వెలిశారు. ఆబాలగోపాలానికీ అసలైన వేడుక తెచ్చారు. వంగల్లులో నాగపడగల వినాయకుడు.. రాపూరులో మహా గణపతి.. సంగంలో శ్రీరాముడి వేషధారణలో బొజ్జ గణపయ్యలు ప్రత్యేక పూజలందుకున్నారు. పొదలకూరులో లింగేశ్వరుడికి విఘ్నేశ్వరుడు ప్రదక్షిణలు చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుచ్చిలో ఊంజల్ వినాయకుడు దర్శనమిచ్చాడు. వైకుంఠపురంలో గరుడుడిపై గణపతి నాట్యమాడారు. బిట్రగుంటలో నందివాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. రంగు రంగుల విద్యుద్దీప కాంతుల్లో తళుకులీనే విగ్రహాలను దర్శించుకున్న భక్తకోటి జన్మ ధన్యమైంది.

- ఆంధ్రజ్యోతి బృందం

జిల్లాలో సమృద్ధిగా నీటినిల్వలు

100 టీఎంసీల నిల్వ ఒక నూతన అధ్యాయం

దేవదాయ శాఖ మంత్రి ఆనం

నెల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు కళకళలాడుతున్నాయని, రెండో పంటకు నీళ్లిచ్చిన తర్వాత కూడా ఈ రెండు జలాశయాల్లో 100 టీఎంసీల నీరు నిల్వ ఉండడం ఒక నూతన అధ్యాయమని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 100 మందికి రూ.83.34 లక్షలను లబ్ధిదారులకు అందించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాది చేపట్టిన సమర్థవంతమైన సాగునీటి నిర్వహణ వల్ల ప్రస్తుతం జిల్లాలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉన్నాయని ఆనం పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో రెండో పంట గానూ 5.24 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చినట్లు గుర్తు చేశారు. రైతులంతా నీటిని వృథా చేయకుండా నీటిని వినియోగంచుకోవాలని కోరారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి ఆనం స్పష్టం చేశారు. ఈ బృహత్తర ప్రణాళికకు రూ.84 వేల కోట్లు ఖర్చువుతందని చెప్పారు. అతి త్వరలో పోలవరం పూర్తవుతుందని, త్వరలోనే బనకచర్ల ప్రాజెక్టు కూడా పట్టాలెక్కుతుందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేశామని ఆనం గుర్తు చేశారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో నేరం రుజువు కావడంతో కొమ్మా శ్రీనివాసులు అనే నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష తోపాటు 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుత తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తీపనూరు గ్రామానికి చెందిన నిందితుడు కొమ్మా శ్రీనివాసులు 2021 జూలై నెల 14న అదే గ్రామానికి చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసి అమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు చిల్లకూరు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చంద్రశేఖర్ వాదించారు.

కలపకు బహిరంగ వేలం



వేలంపాట నిర్వహిస్తున్న రేంజ్ అధికారి కుమారరాజా

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో గురువారం కలపకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈనెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఈ కలప ఇంతేనా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా మాట్లాడుతూ విజయవాడ-బెంగళూరు వరకు చేపడుతున్న 554-జీ జాతీయ రహదారి నిర్మాణంలో సీతారామపురం రిజర్వు ఫారెస్టులో 28.09 హెక్టార్లలో సేకరించిన వంటచెరకు 325.80 సీఎంటీ, టింబర్ 32.113 సీఎంటీలకు బహిరంగ వేలంపాట నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వేలంపాటలో ఎనిమిది మంది పాల్గొనగా దేకూరుపల్లి గ్రామానికి చెందిన కావేటి వెంకటేశ్వర్లు వంట చెరకు రూ.4 లక్షలు, టింబర్ రూ.65 వేలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విద్యుత్ కోతలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

- కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు
- పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్కుల్లో ముందస్తుగా సమాచారం ఇచ్చిన తరువాత విద్యుత్ కోతలు విధించాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 2723 దరఖాస్తులురాగా అందులో 2432 దరఖాస్తులను ఆమోదించామని చెప్పారు. 21 దరఖాస్తులు తిరస్కరించగా 270 పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. పెండింగ్ దరఖాస్తులను సంబంధిత శాఖలు వెంటనే పరిశీలించి ఆమోదించాలని సూచించారు. జిల్లాలో మెగా ప్రాజెక్టుల ద్వారా 13,599 మందికి, భారీ పరిశ్రమల ద్వారా 5,557 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమల పురోగతిని పరిశీలించి అవసరమైన అన్నీ వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష నాయకులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- వామపక్షాల 'విద్యుత్' ప్రతిజ్ఞ
- అమరవీరులకు జోహార్లు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రక్రియను ఉపసంహరించాలంటూ వామపక్ష నాయకులు గురువారం నెల్లూరులో నిరసన తెలిపారు. ప్రతిజ్ఞ దినం పేరుతో ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ అమర వీరులకు జోహార్లు అర్పించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను సమైక్యంగా అడ్డుకుంటామంటూ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో విద్యుత్ చార్జీల పెంపు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా అప్పట్లో చేపట్టిన ఉద్యమ సమయంలో పోలీసుల కారణంగా జిల్లాకు చెందిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఈ దుర్ఘటన జరిగి 25 ఏళ్లు పూర్తయిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలన్న ఉద్యమంలో అమరులైన వారి త్యాగానికి గుర్తుగా విద్యుత్ అమర వీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ నాయకుడు రాంబాబు, ఎస్‌యూటీఐ నాయకుడు బసవరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పెట్టని నిర్వాహకులు

- వైకుంఠపురం మున్సిపల్ స్కూల్‌లో ఘటన
- కావలిలో తల్లిదండ్రుల ఆందోళన
- చందాలు వేసుకుని భోజనం తెప్పించిన టీచర్లు
- స్వయంగా వారే వడ్డన

కావలి,ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు విద్యార్థులకు అన్నం పెట్టకుండా నిలిపివేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. 'మధ్యాహ్నభోజన నిర్వాహకురాలినైనా మార్చండి... లేదంటే మా పిల్లలకు టీసీలు ఇచ్చైనా పంపండి'... అంటూ పాఠశాల వద్ద వారు ఆందోళన చేశారు. దీంతో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని విద్యార్థులకు హోటల్ నుంచి భోజనం తెప్పించి పెట్టారు.

కాగా ఆ పాఠశాలలో 120 మంది విద్యార్థులు, ఒక హెచ్‌ఎం, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం, టీచర్లంతా ఈ ఏడాదే బదిలీపై వచ్చారు. అయితే కొంతకాలంగా అక్కడ విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యాకమిటీతో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలికి మధ్య గొడవలు ఉన్నాయి. ఈనెల 23న హెచ్‌ఎం విద్యాకమిటీతో సమావేశం నిర్వహించారు. కమిటీ వారు మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై భోజనం బాగాలేదని ఆరోపణలు చేశారు. ఆమెను తొలగించనిదే పాఠశాలకు తమ పిల్లలను పంపమని పేర్కొన్నారు. ఈ క్రమంలో గురువారం రాగి జావను ఆలస్యంగా తీసుకువచ్చిన నిర్వాహకురాలు కోటేశ్వరమ్మను 'ఆలస్యంగా తెస్తే ఎలా...? అని ప్రశ్నించారు. దీంతో ఆమె మధ్యాహ్న భోజనమే పెట్టకుండా ఆపేసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేపట్టగా ఉపాధ్యాయులే తమ నగదుతో హోటల్ నుంచి అన్నం తెప్పించి విద్యార్థులకు పెట్టారు.


విద్యార్థికి భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయుడు

నిర్వాహకురాలిని తొలగిస్తాం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేదన్న విషయం నా దృష్టికి కూడా వచ్చింది. అక్కడ మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలికి, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య కొంత గ్యాప్ ఉంది. దీంతో ఆ నిర్వాహకురాలిని తొలగించి మరొకరిని నియమిస్తాం.

- గోవిందయ్య, ఎంఈవో, కావలి

కందుకూరులో మూడు కార్ల దగ్ధం

- దుండగుల దుశ్చర్యగా బాధితుల అనుమానం

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పు పద్మశాలిపాలెంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు అన్నదమ్ములకు చెందిన కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. గురువారం వేకువజామున మూడు గంటల సమయంలో ఇంటి బయట మంటలు కనిపించ డంతో వారు బయటకు వచ్చి చూశారు. మూడుకార్లు మంటల్లో కాలిపోతూ కనిపించాయి. కవర్తపు నరేష్, కవర్తపు శ్రీమాన్య, వారి సోదరుడి కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. అప్పటికే నరేష్‌కి చెందిన స్విఫ్ట్ డిజైర్ కారు పూర్తిగా కాలిపోగా, ఆల్టో కారు పాక్షికంగా కాలిపోయింది. మరో కారు కొద్ది నష్టంతో మంటలను ఆర్పగలిగారు. కార్లు దగ్ధమైన ప్రదేశంలో అగ్గిపుల్లలు ఉండటంతోపాటు లైటనర్ వాసన వస్తుండటాన్ని బట్టి ఎవరో దుండగులు నిప్పుపెట్టి తగులబెట్టారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు మాట్లాడుతూ తమకెవరూ శత్రువులు లేరని, పదిహేనురోజులక్రితం కవర్తపు శ్రీమాన్య తండ్రిని చర్చి సెంటర్‌లో ఓ గుర్తుతెలియని మోటారుసైకిల్ ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యాడని, ఆ కేసులో మోటారుసైకిలిస్టును పోలీసులు గుర్తించి కేసు నమోదు చేయగా వారు రాజీకి రావాలని కోరగా మేము తిరస్కరించామని వారు చెప్పారు. రాజీకి అంగీకరించలేదని వారు ఏమైనా కక్షకట్టి ఈదుశ్చర్యకు పాల్పడ్డారా... లేక మరెవరైనా చేశారా..? అనే అనుమానాలు కలుగుతున్నాయని బాధితులు పేర్కొన్నారు.

తూతూమంత్రంగా శిక్షణ కార్యక్రమం

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం పీఏఐ 2.0 పేరుతో పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికల తయారీలో భాగంగా జిల్లా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నారు. అయితే ఈ శిక్షణకు మండలంలో ఒక ఎంపీటీసీ, ఒక సర్పంచ్ మాత్రమే హాజరు కావడం విశేషం.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9715
వెండి కిలో ధర	రూ. 120300
వెండి ఒక గ్రాము	రూ. 123.30

న్యూస్ బాక్స్

ఘనంగా గిడుగు జయంతి



రాగులతో వేసిన గిడుగు చిత్రాలను చూపుతున్న విద్యార్థినులు

అనంతసాగరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల మర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం తెలుగుభాషా దినోత్సవం, గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాగులతో ఆయన బొమ్మలు చిత్రీకరించారు. 9వ తరగతికి చెందిన మల్లిక, పెంచల ప్రసన్న వీటిని రూపొందించగా ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని అభినందించారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

ఉదయగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జీ.చెర్లోపల్లి గ్రామంలో సర్పంచ్ మతకాల తిరుపతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకట రామారావు బహుమతులు అందజేశారు. అలాగే జీ.చెరువుపల్లి మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బొల్లినేని పరామర్శించారు. ఈసందర్భంగా దశదిన కర్మ నిర్వహణ కోసం కుటుంబ సభ్యులకు రూ.15వేలు ఆర్థికసాయం చేశారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : అనారోగ్యంతో బాధపడుతున్న వరికుంటపాడు పంచాయతీకి చెందిన నందిపోగు బాలయ్య అనే టీడీపీ కార్యకర్తకు బొల్లినేని వెంకటరామారావు ఆర్థికసాయం అందచేశారు. గురువారం కలిగిరిలోని క్యాంపు కార్యాలయంలో రూ.10వేలు అందజేశారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బంది రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పంటల సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీమాధవి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన వ్యవసాయాధి కారులు, విస్తరణాధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ-పంట నమోదుతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చెన్నారెడ్డి, విజయ భాస్కర్, మదన్, సునీల్, ఏఈఓలు భోగ్యం సుధీర్, సుస్మిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సంగం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో గురువారం స్మార్ట్ రేషన్‌కార్డులను అధికారుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు అల్లూరు శ్రీధర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, బూత్, క్లస్టర్ నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

అనంతసాగరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద సాగుచేస్తున్న వరిపంటను మండల వ్యవసాయ విస్తరణాధికారి కృష్ణవేణి గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు. తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరు పంచాయతీ సర్వరాబాదు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఇటీవల పదవీ విరమణ పొందిన గడ్డం ప్రకాష్‌రావు దంపతులను గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు గడ్డం శ్రీనివాసులు, దారపనేని తిరుపాలు, నారాయణ, చెన్నరాయుడు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వాడవాడలా వినాయక చవితి వేడుకలు



అనంతసాగరంలో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న యువత



దుత్తలూరులో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండపాలలో గణనాథులను కొలువుతీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని పంటవీధి, స్పార్క్ సిటీ, జేఆర్‌పేట, కన్యకా పరమేశ్వరి ఆలయంలో, అరుంధతీయపాళెం, ఎస్టీకాలనీ, చల్లావీధి, ఎల్‌ఆర్‌పల్లి, చాకలవీధి, యాదవవీధి, పేరారెడ్డి పల్లి, నెల్లూరుపాళెం, టిడ్కో గృహ సముదాయం, వెంకట్రావుపల్లి తదితర ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటుచేశారు. గురువారం గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి ఉట్టి మహోత్సవం నిర్వహించారు.

●**సంగం :** మండలంలోని ప్రతి గ్రామంలో బుధవారం వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో 5 అడుగుల నుంచి 18 అడుగుల గణనాథుని విగ్రహాలు ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. వంగల్లులో వినాయకుని విగ్రహంతోపాటు శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. వంగల్లు జండామాను యూత్ ఆధ్వర్యంలో నాగపడగల వినాయకున్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. గాంధీ జనసంఘంలో రాముడి వేషధారణలో ఉన్న గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. మండల కేంద్రమైన వడ్డెపాళెం, శివాలయం సెంటర్, రాళ్లచెలిక, శివాజీ సెంటర్, తిరుమనతిప్ప, ముత్తరాశిపాళెం, అంబేడ్కర్ నగర్, సాయినగర్, కొత్తూరు, పెరమన, సిద్ధీపురం, వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెం, ఎస్‌వీఆర్‌పురం, మర్రిపాడు తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. కాగా, సంగం శివాజీ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఉట్టి మహోత్సవంలో బాలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక మండపాల వద్ద ఉట్టి మహోత్సవం నిర్వహించారు.

●**ఏఎస్ పేట:** ఏఎస్ పేటతో పాటు అనుమసముద్రం, చిరమన, హసనపురం, పెద్దహబీపురం తదితర గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం, ఉట్టి ఉత్సవం, పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

●**అనంతసాగరం:** మండలంలోని అన్ని గ్రామాల్లో చవితి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల ఆకృతులతో వినాయక ప్రతిమలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం లడ్డు వేలం, నిమజ్జనం కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

●**ఉదయగిరి:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాలతోపాటు ఉదయగిరి పట్టణంలో విగ్రహాలను ఏర్పాటు చేశారు. గురువారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బీసీ కాలనీలో విగ్రహం వద్ద షావుకారు సలీం, గోగుల రామయ్యలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని గండిపాళెం, తిరుమలాపురం, అప్పసముద్రం, బండగానిపల్లి, చెరువుపల్లి, శకునాలపల్లి, పుల్లాయపల్లి, కృష్ణంపల్లి తదితర గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు ఉట్టి మహోత్సవంతోపాటు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

●**దుత్తలూరు:** చవితి వేడుకల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని నందిపాడు, రెడ్లదిన్నె, నర్రవాడ, పాపంపల్లి, వెంకటంపేట, కొత్తపేట, ఏరుకొల్లు, బ్రహ్మేశ్వరం, రాచవారిపల్లి తదితర గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) :** మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రకరకాల ఆకృతుల్లో కొలువైన వినాయకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలు గ్రామాల్లో దాతలు స్వచ్ఛందంగా అన్నప్రసాద వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

●**వింజమూరు:** మండలం, పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని యాదవ బజారులో వినాయక ప్రతిమ భక్తులకు విశేషంగా ఆకర్షించింది.

ఉదయగిరిని జిల్లా చేయాలి

● మంత్రి ఆనం, కలెక్టర్ ఆనంద్‌కు సాధన సమితి నేతల వినతి



మంత్రి ఆనంకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని గురువారం జిల్లా సాధన సమితి నాయకులు నెల్లూరులో రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్‌లకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు, తాగునీరు లేక పంట భూములు బీళ్లుగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి ఉపాధి లేక ప్రజలు కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. ఉదయగిరి జిల్లా సాధన కోసం ఆరేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. అన్నింటా వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయ సేకరణకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం శనివారం జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా తమ విన్నపాన్ని వారికి తెలపాలని మంత్రి, కలెక్టర్లకు విన్నవించామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యమ నాయకులు షేక్ ఎండీ ఖాజా, రామచంద్రమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌సీ రమణారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు మూలె బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పునర్వ్యవస్థీకరణలో న్యాయం చేయాలి : జేవీవీ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని గురువారం జేవీవీ ఆధ్వర్యంలో డీటీ చంచయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా మారితే సాగు, తాగునీటి కష్టాలు తీరి వలసలను నివారించవచ్చన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన పునర్వ్యవస్థీకరణలో తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి డీవీ రమణయ్య, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఆంద్రా పరంధామిరెడ్డి, నాయకులు శివారెడ్డి, నారాయణ, శ్రీనివాసులు, హర్ష, వెంగబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం : సీపీఎం



ఆత్మకూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం నేతలు పేర్కొన్నారు. గురువారం వారు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 2000 సంవత్సరం ఆగస్టు 28వ తేదీన జరిగిన విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. అనంతరం వారి ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ సీపీఎం కార్యదర్శి దేవిడ్‌రాజు, సీఐటీయు పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, ఆవాజ్ కమిటీ నేత యస్దాని, సీపీఎం నేతలు నాగేంద్ర, జిలాని, రమణయ్య, మస్తాన్, నరసింహులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి :** రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మోదీ, ఆదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలపై రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని యర్రబల్లిగడ్డ గ్రామం వద్ద 167-బీజీ జాతీయ రహ దారిపై గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఆగస్టు 28న 2000 సంవత్సరంలో పోలీసు కాల్పుల్లో అమరులైన వారికి నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారం చేపట్టాక వాటిని అమలు చేయడం దారుణమన్నారు. పెంచిన విద్యుత్, ట్రూఅప్ చార్జీలను వెంటనే తగ్గించడంతోటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడె రమణయ్య, మస్తాన్‌రెడ్డి, నాయబ్, ఈర్ల శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, వెంకటేశ్వర్లు, నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ శైలజకుమారి

సీతారామపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎరువులు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఇంటర్నల్ స్క్వాడ్, ఆత్మకూరు ఏడీఏ శైలజకుమారి సూచించారు. ఆమె గురువారం సీతారామపురంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌తో పాటు బిల్లు పుస్తకాలను, స్టాక్ బోర్డులను నిశితంగా పరిశీలించారు. ఎరువుల నిల్వలు ఆన్‌లైన్ వివరాలు సమానంగా ఉండాలన్నారు. ఎరువులు ఇన్వాయిస్‌లో ఉన్న స్టాకు మాత్రమే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు : ఎస్ఐ

ఉదయగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే నిమజ్జనోత్సవ కార్యక్రమంలో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై నిరసన

సంగం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో శైలజకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కరీముల్లా, బాలచంద్రారెడ్డి, మధురెడ్డి,మదన్‌మోహన్‌రెడ్డి, పణీంద్రరెడ్డి, చందన్ కుమార్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: ఎంఈవో




ఉదయగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో అప్పాజీ అధ్యక్షతన మండలస్థాయి ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మండలంలో 1,492మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 149 మంది వీవోఏలను నియమించామన్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల్లోపు విద్యాభ్యాసం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు, ఏపీఎం శారాస్రవంతి, వయోజన విద్య కోఆర్డినేటర్ అంకారావు పాల్గొ న్నారు.

●**సీతారామపురం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సాయిప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వయోజన విద్యా కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం అక్షరాస్యత పెంపునకు బహుశాఖల సమన్వయంపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్‌వలి, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ అంకారావు, ఏపీఎం శ్యామల తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ



జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

సంగం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడులో జలజీవన్ మిషన్ పథకంలో మంజూరైన ట్యాంకు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంకు శిథిలాస్థితికి చేరడంతో నూతన ట్యాంకు నిర్మాణానికి జలజీవన్ మిషన్ పథకంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రూ. 38 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో ఆర్‌డబ్ల్యూస్ అధికారుల సమక్షంలో భూమిపూజ చేశారు. ఈ సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, సర్పంచ్ నాజున్ని, టీడీపీ నాయకులు ఖాదర్‌బాష మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

జిల్లావ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. మరికొంతమంది గాయాలపాలయ్యారు.

● **గుర్తుతెలియని వాహనం ఢీకొని..**



రసూల్ మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు పాడు జాతీయ రహ దారిపై మంగళవారం అర్థరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మున్సిపల్ బిల్ కలెక్టర్ షేక్ రసూల్(53) మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని జెండావీధికి చెందిన రసూల్ 35 ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య ముజీబా మనస్పర్థలతో పదేళ్లుగా వేరుగా ఉంటున్నారు. ఇద్దరు కుమారులతో రసూల్ తన తల్లి వద్ద ఉంటున్నారు. ముజీబా కుమార్తెతో వేరుగా ఉంటోంది. మద్దూరుపాడు టిడ్కో ఇళ్లల్లో ఉంటున్న స్నేహితుడు సికిందర్ వద్దకు వెళ్లిన రసూల్ ఆత్మకూరుకు వెళ్లాలని కావలి వచ్చేందుకు రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రసూల్‌ను హైవే అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు అల్తాఫ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **సిమెంట్ ట్యాంకర్ ఢీకొని...**



మృతి చెందిన చక్రి

ఆత్మకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు, ముంబాయి జాతీయ రహదారిపై కొండమీద కొండూరు క్రాస్‌రోడ్డు సమీపంలో సిమెంట్ ట్యాంకర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. సంగం మండలంలోని కోలగట్ల హరిజనవాడకు చెందిన కల్లూరు చక్రి (19) వరి కోత యంత్రానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మోటారుబైక్‌పై ఆత్మకూరు వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **వింజమూరులో ఇద్దరు**



విష్ణువర్ధన్‌రెడ్డి

వింజమూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపడియ గ్రామం సమీ పంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద బుధ వారం మధ్యాహ్నం లారీ, బైక్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న దేవల్ల పవన్ కుమార్ మృతిచెందాడు. ఫ్యాక్ట రీలో పని చేస్తూ పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా ఈప్రమాదం జరిగింది. ఇతని స్వగ్రామం దుత్తలూరు మండలంలోని తురకపల్లి గ్రామం. అలాగే బుధవారం రాత్రి నందిగుంట గ్రామ సమీపాన వేగంగా వెళ్తున్న మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడడంతో విష్ణువర్ధన్‌రెడ్డి (25) మృతి చెందగా, బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి గాయాలు కాగా, వారు నెల్లూరులో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఇసుక టిప్పర్

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద 167-బీజీ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఇసుక టిప్పర్ ఢీకొన్న సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకొంది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంగం ఇసుక రీచ్‌లో ఇసుక లోడు చేసుకుని ప్రకాశం జిల్లా డీజీపేటకు వెళుతున్న టిప్పర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే రహదారిపై ఒక్కసారిగా గేదెలు అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది.

వ్యాను, ఆటో ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బుచ్చి-జొన్నవాడ మార్గంలో బుధవారం ఉదయం నెల్లూరునుంచి బుచ్చివైపు వెళ్తున్న ఓ ఆటో ఓ టాటా మేజిక్ వ్యానును ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవరు ఏడుకొండలుతోపాటు, తల్లి ఆమె కుమారుడు, ఆటో డ్రైవర్ వినోద్, భార్య రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు.

పిడుగుపాటుకు గృహోపకరణాల దగ్ధం

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మకాలనీ అట్టల ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి పిడుగుపాటుకు ఫ్యాన్లు. టీవీలు కాలిపోయాయని ఆ ప్రాంత వాసులు పేర్కొన్నారు. అర్ధరాత్రి వర్షంతోపాటు పెద్ద శబ్దంరావడం, విద్యుత్ హెచ్చుతగ్గులు వచ్చి కాలనీలోని మాదాల వెంకటేశ్వర్లు, కంచర్ల సురేష్, మాతయ్య ఇళ్లలోని ఫ్యాన్లతోపాటు పలువురి ఇళ్లల్లోని టీవీలు కూడా కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అక్క మృతిపై అనుమానం.. చెల్లెలి ఫిర్యాదు



విజయలక్ష్మి మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరులో ఉంటున్న తన అక్క గొట్టిపాటి విజయ లక్ష్మి(59) మృతిపై అనుమానం ఉందని నెల్లూరు బీవీ నగర్‌లో ఉంటు న్న స్వర్ణ రాధిక గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, ముసునూరు కమ్మపాలెంలో ఉంటున్న గొట్టిపాటి వెంక టేశ్వర్లు, బోగోలు మండలం బుర్రోడుపాలెంకు చెందిన విజయ లక్ష్మికి 40 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కుమార్తెలు కిరణ్మయి, స్వర్ణ లత. వారివురికి పెళ్లిళ్లు చేశారు. అయితే ఈనెల25న విజయలక్ష్మికి ఆరోగ్యం సరిగాలేదని, వచ్చి చూసుకోమని ఆమె ఆరుగురి చెల్లెళ్లకు వెంక టేశ్వర్లు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె చెల్లెళ్లలో ఒకరైన అన్నమ్మ అదేరోజు వచ్చి వెళ్లగా, ఈనెల 26న మిగిలిన చెల్లెళ్లు అయిన విజయమ్మ, కమలమ్మ, శోభ, శ్రావణి, రాధిక ముసునూ రులోని అక్క ఇంటికి వచ్చారు. వారిలో అదే రోజు కమలమ్మ, శ్రావణి వెళ్లిపోగా, విజయమ్మ, శోభ, రాధిక 27 రాత్రి వరకు ఉండి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున విజయ లక్ష్మి మృతి చెందిందని వెంకటేశ్వర్లు మళ్లీ ఆమె చెల్లెళ్లకు ఫోన్ చేశా డు. దీంతో వారు వచ్చి చూసి అక్క మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి చెల్లెలు రాధిక ఫిర్యాదు మేరకు విజయలక్ష్మి మృత దేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు : వైసీపీ నేతపై కేసు

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నెల్లూరుకి చెందిన వైసీపీ నేత తౌసిక్‌పై గురువారం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు, ఈనెల 26న ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి నెల్లూరులో పెట్టిన ప్రెస్ మీట్‌కు కౌంటర్‌గా, ఈనెల 27న నెల్లూరులో తౌసిక్ ప్రెస్ మీట్ పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై కావలి 29వవార్డు జనసేన ఇన్‌చార్జి సిద్దవరపు జానీ ఫిర్యాదుతో ఎస్ఐ జమాల్‌వల్లీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 555త

చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు

కావలి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనతాపేట నుంచి అన్నపుగుంటకు వెళ్లే డ్రైనేజీ కాలువలో చెత్తా చెదారం పేరుకు పోకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆ కాలువలో చెత్తపేరుకుపోయి ఓవర్‌ఫ్లో అవుతుందనే స్థానికుల సమాచారం మేరకు, గురువారం కమిషనర్, మున్సిపల్ డీఈ సాయిరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావులు కాలువలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. ఆ కాలువ నుంచి చెత్త అన్నపుగుంటలోకి రాకుండా తూముల వద్ద ఇనుపమెస్ ఏర్పాటు చేసి ఉండటంతో ఆ మెస్ వద్ద చెత్త పేరుకు పోయి నీరు ఓవర్ ఫ్లో అవుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఆ మెస్ వద్ద ఉన్న చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు.



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం : కాకర్ల



దొడ్ల వెంకటరత్నం భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకు మహేష్ తాత దొడ్ల వెంకటరత్నం భౌతిక కాయానికి, ఎమ్మెల్యే కాకర్ల, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వేర్వేరుగా పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ టీడీపీ నాయకుడు ఇంగ్లే కల్లయ్య దశదిన కర్మలో పాల్గొని కల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారికుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఇష్టారీతిన మాట్లాడితే తాట తీస్తాం!

కావలి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని గురించి ఇష్టారీతిన మాట్లాడితే తాటతీస్తామని పట్టణ ముస్లిం మైనార్టీ నేతలు హెచ్చరించారు. స్థానిక షాదీమంజిల్‌లో గురువారం సాయంత్రం వారు సమావేశమై వైసీపీ నేతలపై విరుచుకుపడ్డారు. ముస్లింలకు అండగా నిలుస్తున్న ఏకైక నాయకుడు క్రిష్ణారెడ్డి అని, ముస్లింలకు ఏ సమస్యవచ్చినా ముందుకు వచ్చి పరిష్కరించే నేత అన్నారు. నెల్లూరు వైసీపీ మైనార్టీ నాయకుడు సమీర్ ఖాన్ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ , ఆయనకు నిజంగా ధైర్యం ఉంటే కావలికి వచ్చి మాట్లాడితే నీఆరోపణల్లో నిజమెంతో అబద్ధమెంతో తేలుస్తామన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం, అన్సర్, అర్షియాబేగం, ఖమర్‌బాబు, ఫిరోజ్, రఫీ, రసూల్, మన్సూర్, ఆశిఫా, పర్విన్‌జానీ, అల్తాఫ్, ఎస్థానీ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను రికార్డుల్లో ఇంటిపేరు, డోర్ నెంబర్లలో తప్పులుంటే సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కే. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల యజమానులు మీకు కేటాయించిన అసెస్‌మెంట్‌లో ఉన్న తప్పుల సవరణకు తగిన ఆధారాలతో వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మంచిరాజు మురళి

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ అమ్మవారి అనివేటి మండపం నిర్మాణానికి మంచిరాజు వెంకట మురళీమోహన్, అపర్ణ దంపతుల పెద్దకుమారుడు వంశీకృష్ణ, హనుమత్‌ప్రశాంతి దంప తులు గురువారం రూ. 50వేలు విరాళంగా అందజేశారు. మనవరాళ్లు దీత్యఆర్యాహి, ధృతిఐనితల పేరుతో మంచిరాజు మురళి ఆ మొత్తాన్ని ఆలయ కమిటీసభ్యుడు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట గురునిలయంలో గొలగమూడి వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి నామ సంకీర్తనలతో నగర బిక్షాటన కార్యక్రమం జరిగింది. రాత్రి సత్సంగం జరిగింది. శుక్రవారం ఆరాధన జరగనున్నది.

ఓ బొజ్జ గణపయ్యా... మము కాపాడవయ్యా!

- వాడవాడలా వేడుకగా చవితి వేడుకలు
- మండపాల్లో గణేశుడి విగ్రహాలను కొలువు దీర్చి ప్రత్యేక పూజలు
- పలుచోట్ల అన్నప్రసాద వితరణ
- ఎడ్ల పందేలు, కోలాటం భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ



కలిగిరి: మల్లితోటలో రూ.50నోట్లతో వినాయకుడికి అలంకరణ



ఉలవపాడు : గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వలేటివారిపాలెం పాలకేంద్రం వద్ద ప్రత్యేక అలంకరణలో వినాయకుడు



లింగసముద్రంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బుధవారం వాడవాడలా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఆముదాలదిన్నెలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కొనదిన్నె గిరిజన కాలనీలో చిన్నారులు ఏర్పాటు చేసిన బుల్లి మండపంలో స్వామి వారిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ముసునూరు బాలాజీనగర్‌లోని అన్న సంతర్పణ, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రాత్రికి కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శన నిర్వహించారు. తుమ్మలపెంట రోడ్డులో చిన్నారులు వినాయక విగ్రహాన్ని చెక్కబండిపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. చౌదరిపాలెంలో అన్నదానం చేశారు.

కావలి : పట్టణంలో బుధవారం ఉదయాన్నే ప్రతి ఇంటిలో వినాయక ప్రతిమలకు పూజలు చేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కావలిలో అధికారికంగా ఒకటో పట్టణ పరిధిలో128, రెండో పట్టణ పరిధిలో 59 విగ్రహాలు వారివారి స్థాయిని బట్టి వివిధ రూపాల్లో ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతప్రజలు స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయకవిగ్రహాల వద్ద తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కలుగోళ్ల శాంభవి ఆలయంలో 9 రోజులపాటు ఉత్సవాలు జరపనున్నారు. కాగా వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బుధ, గురువారాల్లో ఆయన పట్టణంలో పలు వినాయక విగ్రహాలను సందర్శించి అక్కడ ఉత్సవాల్లో పాల్గొన్నారు. పాతూరు శివాయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకుని స్వామి వారి అభిషేకం, ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

కందుకూరు : పట్టణంలోని పెద్దబజారులోని వాసవీ గ్రంథాలయం, పడమర బలిజపాలెంలలో కొలువైన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాసవీగ్రంథాలయంలో 15 అడుగుల ఎత్తైన నటరాజవినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయటంతో పాటు మండపం ముందు బాలగంగాధర్‌తిలక్, ఛత్రపతి శివాజీమహారాజ్‌ల విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటుచేశారు. ఉత్సవమండపాల వద్ద ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.పడమర బలిజపాలెంలోను హంసవాహనంపై నాట్యం చేస్తున్న గణేశుడు విగ్రహం ఆకట్టుకుంటోంది. కాగా బుధవారం పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా ఉపవాసాలు



కావలి : బృందావనం కాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

ఉండి గణనాథునికి ప్రత్యేకంగా పత్రి, నైవాద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం నైవేద్యాలతో గ్రామాలలో నవరాత్రి ఉత్సవాల కోలాహలం నెలకొంది.

అల్లూరు : మండలంలోని ఊరూరా గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.అల్లూరు పాతబస్టాండు కూడలిలోని విఘ్నేశ్వర ఆలయ ఆవరణలో ప్రత్యేక మట్టితో 9 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాండురంగ దేవాలయ ప్రాంతంలో 9 అడుగుల గణపతిని ఏర్పాటు చేశారు.

కలిగిరి : మండలంలో బుధవారం చవితివేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ఆకృతులతో రెండు నుంచి ఐదు అడుగు విగ్రహాల వరకు ఏర్పాటు చేసుకొని పండుగ జరుపుకున్నారు. పట్టణంలో మల్లితోటలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి రూ.50నోట్లతో ఏర్పాటు చేసిన అలంకరణ ప్రత్యేకతను చాటుకుంది. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తన స్వగ్రామమైన పెద్దపాడులో వినాయకచవితివేడుకల్లో పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలో సుమారు 100 గణేషుడి విగ్రహాలు ప్రతిష్ఠించారు. మూడవ రోజు శుక్రవారం మండలంలో అధికశాతం విగ్రహాలు నిమజ్జనానికి తరలిస్తారు.

కొండాపురం : బుధవారం మండలపరిధిలోని అన్నీ గ్రామాలలోనూ వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. గురువారం పలు గ్రామాలలో పిల్లలకు, పెద్దలకు ప్రత్యేకంగా వివిద ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. అలాగే నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు. యువతకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



కొండాపురం : గణేశ్ ఉత్సవాల్లో ఉట్టి కొడుతున్న యువత

వలేటివారిపాలెం : మండలంలో చవితి వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్నీ గ్రామాల్లో సుమారు 70 విగ్రహాలను ఏర్పాటు చేశారు. విభిన్న రూపాల్లో వినాయకుడు విగ్రహాల ప్రతిమల మండపాల్లో కొలువుదీరాయి.

జలదంకి : వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం గణేశుడి విగ్రహాలు నెలకొల్పారు. ఆయా మండపాల వద్ద యువకులు సందడి చేశారు. విద్యుద్దీపాలంకరణలతో విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జలదంకిలో జిల్లా స్థాయిలో సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలు జానకీ రామలింగేశ్వరస్వామి గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వహించింది. గురువారం పలుచోట్ల అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



జలదంకి : బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎడ్లు

బిట్రగుంట : బోగోలు మండలంలో వినాయక చవితి పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మట్టి వినాయక ప్రతిమలకు చాలామంది కొనుగోలు చేసి పూజల తరువాత నిమజ్జనం చేశారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఎస్వీపాలెం పంచాయతీ, మండల, ఇతర ప్రాంతాల ఆక్వా రైతులకు నెల్లూరుకు చెందిన షేక్. సాబ్‌జాద్ నందివాహంపై గణనాథుడి విగ్రహాన్ని అందచేశారు. స్థానిక రామభక్తబృందం కోలాటభజనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణప్రసాద్‌రెడ్డి, భానుచంద్రరెడ్డి, నాగేంద్ర, రాఘవేంద్ర పాల్గొన్నారు.



కందుకూరు : శివాలయం వద్ద కొలువుదీరిన హంసవాహనంపై నాట్యం చేస్తున్న విఘ్నేశ్వరుడు

లింగసముద్రం : మండలంలో వినాయక చవితి వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దాదాపు అన్నీ గ్రామాల్లో భక్తులు వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో గణనాథుడి విగ్రహాల కోసం మండపాలను ఏర్పాటు చేసి, రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకిరించి పూజలు చేశారు.

విద్యుత్ ఉద్యమ అమరవీరులకు జోహార్లు



కావలి : బ్రిడ్జి సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నాయకులు

కావలి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న ప్రదర్శనపై జరిపిన కాల్పుల్లో అశువులు బాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామికి వామపక్షాల నేతలు జోహార్లు అర్పించారు. గురువారం సాయంత్రం కావలి బ్రిడ్జిసెంటర్‌లో మీ ఆశయాలు కొనసాగిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమ అమరవీరులారా ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేక పోరాటంలో ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన మీకు విప్లవ జోహార్లన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీ. పెంచలయ్య, నేతలు క్రిష్ణమోహన్, కృష్ణయ్య, సీపీఐ నేతలు దమ్ముదర్గాబాబు, బోస్, వెంకటేశ్వర్లు, స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు శ్యామల, ఉపాధ్యాయ నాయకులు గురునాథశర్మ, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : విద్యుత్ పోరాట అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఉలవపాడులో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్ సర్ చార్జీల రూపంలో విధిస్తున్న విద్యుత్ చార్జీల భారాలను రద్దు చేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ నాయకులు కత్తి సుజాత, సీపీఎం నాయకులు వీసం, విజయ్‌కుమార్, ఎం లలితమ్మ, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో మౌలిక సదుపాయాల అభివృద్ధి : ఎమ్మెల్యే ఇంటూరి



రోడ్డు వైడనింగ్, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయటం, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరులో జ్వాలాముఖి అమ్మవారి ఆలయం సెంటర్ నుంచి సెయింట్‌పీటర్ స్కూల్ వరకు రోడ్డు వైడనింగ్, సెంట్రల్ డివైడర్, లైటింగ్‌సిస్టమ్ ఏర్పాటు పనులకు, కోటారెడ్డి ఆసుపత్రి సర్కిల్‌లోని దివి కొండయ్య విగ్రహం వద్ద నుంచి వాసవీకాలనీ వరకు సీసీ కాలువ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో గతంలో ఎన్నడూ ఎవరికీ ఇవ్వని మెజారిటీని ప్రజలు తనకు అందించి ఆశీర్వదించారని, వారి ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేసి చూయించాలన్న లక్ష్యంతో కృషిచేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. అనూష, డీఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- **విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేకదృష్టి**

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల శ్రేయస్సుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి తగిన ప్రోత్సాహకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయం ఆవరణలో గురువారం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు విద్యాశాఖ - సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల కోసం నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు కూటమిప్రభుత్వం ప్రతినెలా 6వేల ఫించన్ ఇవ్వటంతో పాటు పాఠశాలలకు వెళ్లే దివ్యాంగ విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ కూడా పెంచిందన్నారు. రాష్ట్ర ఏఈ కో ఆర్డినేటర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవితకేంద్రాలకు క్రమంతప్పకుండా పంపాలన్నారు. ఈ సందర్భంగా 100మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం. నాగకుమారశర్మ, సుబ్బారెడ్డి, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవో రత్నజ్యోతి, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ఉన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- **స్మార్ట్ కార్డులతో అక్రమాలకు చెక్ : ఇంటూరి**

వలేటివారిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌కార్డుల పంపిణీతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బడేవారిపాలెంలో గురువారం లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వగ్రామంలో ప్రజలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నయాంఅహ్మద్, టీడీపీ మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు తాటికొండ సింహాద్రి, పొడపాటి నరసింహం, ఇంటూరి శంకరయ్య, కృష్ణ, గురిజాల బెంజిమెన్, వలేటి నరసింహం ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన ముళ్ల చెట్లతో ప్రమాదాలు



వలేటివారిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం నుంచి చినఅమ్మపాలెంనకు వెళ్లే గ్రావెల్‌రోడ్డు చిల్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో వాహనదారులు మార్జిన్ దిగితే ముళ్ల చెట్లు తగిలి ద్విచక్రవాహనదారులకు గాయాలవుతున్నాయి. వలేటివారిపాలెం నుంచి చినఅమ్మపాలెంనకు తక్కువ దూరం కావడం, సమయం ఆదా అవడంతో వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించాలి.

పోలీసుల అదుపులో ఎమ్మెల్యే రెక్కీ కేసు నిందితులు

జలదంకి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిపై ఈనెల 19న జలదంకి మండలం అన్నవరంలోని గురురాఘవేంద్ర స్టోన్‌క్రషర్స్ వద్ద డ్రోన్‌కెమెరాతో రెక్కీ నిర్వహించిన కేసులో నిందితులైన ఆత్మకూరి రాజేష్, దామెర్ల శ్రావణ్‌లను గురువారం కావలి సబ్‌డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెక్కీకి గల కారణాలపై పోలీసులు వారిని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులు కోర్టు ఆదేశానుసారం రిమాండ్‌లో ఉండగా, కావలి మాజీఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఐదో నిందితుడిగా ఉన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ శిక్షణ

బిట్రగుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటీ అకాడమీ వారు గురువారం శిక్షణ నిర్వహించారు. ఐసిటీ అకాడమీకి చెందిన నందిని తోట ప్రాక్టికల్ ఆధారిత సెషన్లను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పీవీఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డి, ఏవో రమణారెడ్డి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటీ అకాడమీ ఎస్‌పీవోసీ డా., సత్యనారాయణరెడ్డి మహిళా మెంటార్లు డాక్టర్ బృందావని, లిల్లీగ్రేస్‌మేరీ, తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

బిట్రగుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బేతనీపేట ప్రజలు నిత్యం విద్యుత్ లోఓల్టేజీతో సతమతమవుతుండటంతో విద్యుత్ శాఖ ఏఈ జడరాయ గురువారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత జీ.సంజయ్ మాట్లాడుతూ విద్యు త్ సమస్యను కావలి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో యుద్ధ ప్రాతిపదికన 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు మార్చి 100 కేవీ ఏర్పాటు చేశారని అన్నారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టు కుని వెంకటనే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డితోపాటు విద్యుత్ ఏఈకి గ్రామస్థులు వినోద్, సుబ్బరాయుడు, రాజేంద్ర, బన్ని, డ్యాని కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా నిల్వల కోసం ప్రతిపాదనలు

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం, పాలూరు - దొండపాడు, మోపాడు రైతు సేవాకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం వరిసాగులో ఉన్నందున ఆయా కేంద్రాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఏవో అబ్దుల్‌రహీం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరంలో 303 ఎకరాలు, పాలూరు - దొండపాడు పరిధిలో 165 ఎకరాలు, మోపాడులో 20 ఎకరాలు ప్రస్తుతం వరిసాగులో ఉందని, మరికొంత విస్తీర్ణం నాట్లుకోసం సిద్ధం చేస్తున్నందున రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా ఆర్ఎస్‌కేలలో ఎరువుల నిల్వకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

- **పంటల సాగులో మెలకువలు పాటించాలి**

వలేటివారిపాలెం : పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో శేషరెడ్డి తెలిపారు. మండలంలోని శామీరపాలెం రైతు సేవా కేంద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ పంటలపై వ్యాపించే చీడపీడల నివారణపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- **లింగసముద్రం** : పత్తి పైరులో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కే. హర్షవర్ధన్ తెలిపారు.గురువారం మండలంలోని వీఆర్ కోట, అన్నెబోయినపల్లి గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, ఏఎంసీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



లింగ సముద్రం : అన్నెబోయినపల్లిలో పత్తి పైరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏవో హర్షవర్ధన్

బహురూప గణేశ

వినాయక చవితి సందర్భంగా జిల్లావ్యాప్తంగా కూడళ్లలోని మండపాల్లో విభిన్న ఆకృతుల్లో.. భారీ ఆకారాల్లో విఘ్నేశ్వర విగ్రహాలను నెలకొల్పారు. తిరుపతి నగరంలోని విగ్రహాల్లో కొన్ని విభిన్నమైన విగ్రహాలు న్నాయి.



తీర్థకట్టవీధి: అయ్యప్ప రూపంలో..




యాదవవీధి: 4500 కామాక్షమ్మ దీపాలతో..



ఎంఆర్‌పల్లె: గరుడ వినాయకుడు



→ వినాయకుడికి గోమాత క్షీరాభిషేకం



నాట్య గణపతి: బంకమట్టితో ఎస్వీ శిల్పకళాశాల విద్యార్థుల తయారీ

భూమన ధర్మపరిరక్షకుడు కాదు.. భక్షకుడు



భూమన కరుణాకరరెడ్డి హిందూధర్మ పరిరక్షకుడు కాదు.. టీటీడీని దోచేసిన భక్షకుడు. కల్యాణమస్తు పేరిట ఎవరినిపడితే వారిని పట్టుకొచ్చి పెళ్లిళ్లు చేయించడం హైందవ పరిరక్షణ అవుతుందా? వైజాగ్‌లో దళితగోవిందం నిర్వహించి ఒక అగ్గిపెట్టెకు రూ.12వేలు బిల్లువేసినట్టు ఆడిట్ నివేదకలో బట్టబయలైంది. ఈ రెండు స్కీముల్లో అప్పుడు విచ్చలవిడిగా అవినీతి చేశారు కాబట్టే 2019-24లో వాటి జోలికి వెళ్లలేదు.

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

వైఎస్ వల్లే ఐఏఎస్ శ్రీలక్ష్మి జైలుకెళ్లింది



ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెప్పినచోటల్లా సంతకాలు పెట్టిన ఐఏఎస్ శ్రీలక్ష్మి చివరకు జైలుకు వెళ్లారు. ఐఏఎస్ హోదాను ఎంతో కోల్పోయారు. ఒక మహిళా ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సంబంధించి విగ్గులు, చీరలు అంటూ విమర్శలు చేయడం మంచిది కాదు. అలాంటి విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి

విద్యుత్ ఉత్పత్తికి 'వేదాంత- మీనాక్షి' సిద్ధం

- రోజువారీ వెయ్యి మెగావాట్ల సామర్థ్యం
- ట్రయల్ రన్ విజయవంతం
- వాణిజ్య ఉత్పత్తికి ఎస్‌ఆర్‌ఎల్‌డీసీ నుంచీ అనుమతి

తిరుపతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేదాంత-మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ సంస్థ విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ట్రయల్ రన్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం వద్ద 1996లో వికాస్ పవర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ పేరిట థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభమైంది. ఆపై ఈ సంస్థ మీనాక్షి ఎనర్జీగా పేరు మార్చుకుంది. అటు తర్వాత పలు యాజమాన్యాలు మారాయి. చివరికి ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని 2019లో కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్‌లోకి వెళ్లింది. ఈ సంస్థను 2023లో వేదాంత లిమిటెడ్ స్వాధీనం చేసుకుంది. ఈ వేదాంత లిమిటెడ్ అనేది దేశంలోనే పేరున్న విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో ఒకటి. రెండేళ్లలోపే వేదాంత సంస్థ మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్‌ను పునరుద్ధరించింది. వెయ్యి మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సంతరించుకుంది. 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు రెండు, 150 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు రెండు చొప్పున మొత్తం నాలుగు యూనిట్లు ఏర్పాటు చేసింది. బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ సంస్థ తయారీ ప్రక్రియ కోసం మంచి నీటిని కాకుండా వంద శాతం సముద్ర ఉప్పు నీటిని వినియోగిస్తోంది. వృథాగా మిగిలే బూడిద నిల్వల నుంచీ నీటిని తిరిగి వినియోగంలోకి తెస్తోంది. ఇటీవలే చివరి యూనిట్ ఏర్పాటు పూర్తి కాగా విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి 72 గంటల ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది. దీంతో సదరన్ రీజనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచీ కమర్షియల్ ఆపరేషన్ డేట్ కూడా ఖరారైంది. మొత్తం నాలుగు యూనిట్ల నుంచీ రోజుకు వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసి గ్రిడ్‌లకు నిరంతరం సరఫరా చేసేందుకు పూర్తి స్థాయిలో పవర్ ప్లాంట్ సిద్ధమైంది.

ప్లాంట్ ఏర్పాటుతో 1150 మందికి ఉపాధి

వేదాంత ప్లాంట్ ఏర్పాటుతో 1150 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినట్టు ఆ సంస్థ సీఈవో రాజిందర్ సింగ్ ఆహూజా ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం సిబ్బందికి ఆధునిక డిజిటల్ సెక్యూరిటీ సిస్టమ్ కల్పించామని పేర్కొన్నారు. తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగుల్లో 21 శాతం మంది మహిళలు, 42 శాతం మంది యువ నిపుణులు ఉండటం వేదాంత పవర్ సంస్థ మానవ వనరుల సామర్థ్యాన్ని చాటుతోందని పేర్కొన్నారు. తమ సంస్థ ఏపీ అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్ తరాలకు నమ్మకమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.



తమ్మినపట్నం వద్ద ఉత్పత్తికి సిద్ధమైన వేదాంత-మీనాక్షి పవర్ ప్లాంట్

నేత్రదానం చేయాలనుకుంటున్నారా?

- అరవింద్ ఆస్పత్రిలో హెల్ప్‌లైను నెంబరు ప్రారంభించిన టీటీడీ ఈవో

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ మరణానంతరం నేత్ర దానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అలాంటి వారి కోసం తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో నేత్రదాన కేంద్రాన్ని.. 93983 58828 హెల్ప్‌లైను నెంబరును టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం ప్రారంభించారు. 'డయల్ ఈవో కార్యక్రమంలో ఓ భక్తుడు టీటీడీ పరిధిలో ఒక నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. అప్పటి నుంచి నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేశాం. ఆ విషయాన్ని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి వారి దృష్టికి తీసుకురాగా వెంటనే నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలకు భక్తులు ముందుకు రావాలి' అని ఈవో పిలుపునిచ్చారు. ఆస్పత్రి సీఎంవో డాక్టర్ అశోక్‌వర్ధన్ మాట్లాడుతూ.. దేశంలో 11 లక్షల మందికిపైగా కంటి చూపు కోసం ఎదురు చూస్తుంటే, వీరిలో 25 వేల మందికే దాతలు ఇచ్చిన కళ్లను అమర్చి కంటి చూపును ప్రసాదించే అవకాశం ఉందన్నారు. ప్రజలు నేత్రదానానికి ముందుకొస్తే అవసరమైన వారందరికీ కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డాక్టర్లు సురేంద్ర, బిస్వజిత్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబరు ప్రారంభిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

మరొకరికి చూపునిస్తాం

- తనతో పాటు తన తండ్రి నేత్రదానానికి అంగీకార పత్రాన్నీ అందజేసిన కలెక్టర్



నేత్రదానానికి అంగీకార పత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేత్రదానానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ముందుకొచ్చారు. తనతో పాటు తన తండ్రి మరణానంతరం కళ్లు అందించేలా స్వచ్ఛందంగా అంగీకరిస్తూ ప్రతిజ్ఞాపత్రంపై సంతకం చేశారు. ఈ పత్రాన్ని గురువారం ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రి నేత్ర విభాగం అధిపతి చలపతిరెడ్డికి అందించారు. నేత్రదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేత్రదానానికి సంబంధించి ప్రతిజ్ఞాపత్రం అందజేశారు. ఒకరు నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి కంటి చూపు వస్తుందన్నారు. నేత్రదానాన్ని కుటుంబం సంప్రదాయంగా చేసుకోవాలని సూచించారు. సెప్టెంబరు 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని దాని విశిష్టతను తెలుసుకుని తాము నేత్రదానం చేయడమే కాకుండా తోటివారినీ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలోమ డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, రుయాస్పత్రి సూపరింటెడెంట్ రాధ, ఐబ్యాంకు టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న మహరాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్

అమ్మవారి సేవలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్

తిరుచానూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. మంత్రి నారాయణ, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయనకు స్వాగతం పలికారు.తొలుత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం మూలమూర్తిని దర్శించుకున్నారు.ఆలయ పండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.గవర్నర్ రాధాకృష్ణన్‌తో పాటు టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ దర్శించుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.





ధ్వజపటాన్ని ఎగుర వేస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ - హంస వాహనంపై వినాయకస్వామి

ముక్కంటి సేవలో విదేశీ భక్తులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని గురువారం పలువురు విదేశీ భక్తులు దర్శించుకున్నారు. మైసూరుకు చెందిన తపస్వని యోగాశ్రమం ద్వారా ఇటలీకి చెందిన ఏడుగురు, అమెరికాకు చెందిన ఇద్దరు భారత సంప్రదాయ వస్త్రధారణతో వచ్చారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లుచేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని వారు కొనియాడారు.

బ్రహ్మోత్సవ వైభవం

- కాణిపాకంలో ఘనంగా చవితి వేడుకలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. వినాయక వ్రతాన్ని నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యేలు తదితరులను పట్టు వస్త్రాలను సమర్పించారు. సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను బుధవారం రాత్రి పురవీధులలో ఊరేగించారు. ఇక, బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.స్వాతి నక్షత్ర యుక్త శుభలగ్నంలో మూషిక ధ్వజపటాన్ని నింగికి ఎగుర వేశారు. గురువారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా యాగశాల ప్రవేశ పూజను నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఈవో పెంచల కిషోర్‌కు, ఆలయ అర్చకులు ధర్మేశ్వరగురుకుల్‌కు రక్షా బంధనాన్ని కట్టారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభానికి, మూషికానికి రక్షా బంధనాన్ని కట్టారు. రాత్రి స్వామికి హంస వాహన సేవను నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించాక హంస వాహనంపై ఉంచి ఊరేగించారు.





కొల్లు రవీంద్ర, అన్బుమణి రామదాస్ - జస్టిస్ బాలాజీ

తిరుమలలో ప్రముఖులు


తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధ, గురువారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీవీ బాలాజీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రామదాస్ ఉన్నారు.

తిరుమలలో పర్యావరణ ప్రణాళిక రూపొందించండి

● ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వృక్ష సంపద పెంపు, మానవులు-వన్యప్రాణుల సంఘర్షణ నివారణ చర్యలపై అటవీశాఖ అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన సమీక్షలో జేఈవో వీరబ్రహ్మంతో టీటీడీ డీఎఫ్‌వో పణికుమార్ నాయుడు పాల్గొన్నారు. గతేడాది తిరుమలలో చేపట్టిన వృక్షజాతుల పెంపకం, ఔషధ వనాల అభివృద్ధి, సుస్థిర అటవీ పునరుద్ధరణ చర్యలు వంటి వాటిపై డీఎఫ్‌వో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు తాండ్ర, రావి, ఉసిరి, వెలగ, జువ్వి, మర్రి, నేరేడు, అత్తి, ఎర్రచందనం వంటి 7 వేల మొక్కలు నాటినట్టు వివరించారు. వాటర్‌షెడ్, మట్టిస్థిరీకరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. వన్యప్రాణుల నిర్వహణలో భాగంగా అలిపిరి-తిరుమల మార్గాల్లో రెండువైపులా 60 కెమెరా ట్రాపులు, 31 సౌరశక్తితో నడిచే యాక్టివ్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. శ్యామలరావు మాట్లాడుతూ..మరింత ఆధునిక నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమ, మంగళ వారాల హుండీ ఆదాయం: రూ.6.55 కోట్లు

మంగళ, బుధవారాల్లో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 1,55,022

తలనీలాలు సమర్పించినవారు: 44,608

'ఇంటి గణపయ్య'ల నిమజ్జనం





తిరుపతిలోని ఇళ్లల్లో వినాయక ప్రతిమలతో 'చవితి' పూజలు నిర్వహించిన వారిలో చాలామంది బుధవారం సాయంత్రమే విగ్రహాలను నిమజ్జనం చేశారు. కుటుంబ సమేతంగా వినాయక సాగర్‌కు విగ్రహాలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కొన్ని పెద్దవిగ్రహాలనూ తీసుకొచ్చారు. కాగా, మండపాల్లోని భారీ విగ్రహాలను ఐదో రోజైన ఆదివారం నిమజ్జనం చేయనున్నారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి



సమన్వయంతో ముందుకు సాగేలా..!

● నేటి దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగే లక్ష్యంతో దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, పోలీసు ఉన్నతాధికారుల సమావేశం జరగనుంది. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో శుక్రవారం ఉదయం జరిగే సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 65 మంది అధికారులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి దాదాపు ఏడు కమిటీలను నియమించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన పాండిచ్చేరి, లక్షదీప్, అండమాన్ నికోబార్ నుంచీ పోలీసు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. గురువారానికే నలుగురు డీజీపీలు సహా మొత్తం 56 మంది తిరుపతికి చేరుకున్నారు. వీరికి 14 మందికి హోటల్ తాజ్, 42 మందికి గ్రాండ్ రిడ్జ్‌లో వసతి ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలు, ఉగ్రవాద నిర్మూలన, ఎర్రచందనం స్మగ్లింగ్, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం, అంతర్రాష్ట్ర నేరస్థుల ముఠాలను పట్టుకోవడం, సైబర్ క్రైం, నూతన టెక్నాలజీ వినియోగం, సమాచార మార్పిడి వంటి అంశాలపై చర్చించనున్నారు. ప్రధానమైన పది అంశాలపై చర్చించి.. సంయుక్తంగా ముందుకెళ్లడానికి కార్యాచరణ రూపకల్పనకు చర్యలు చేపట్టనున్నారు.

అర్హులైన దివ్యాంగులకు న్యాయం

● కలెక్టర్ వెంకటేశ్వర్ భరోసా



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీడబ్ల్యూడీ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పింఛను రీవెరిఫికేషన్‌లో ఇబ్బంది కలిగి ఉంటే సరిదిద్ది న్యాయం చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ దివ్యాంగులకు భరోసా ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ(పీడబ్ల్యూడీ)తోపాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులు వచ్చిన వారందరికీ అప్పీలు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. సంబంధిత ఆస్పత్రుల్లో సదరం వెరిఫికేషన్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ఇబ్బందులు పరిష్కరిస్తారన్నారు. అనర్హులకు పింఛను అందుతుందనే ఉద్దేశంతో పునఃపరిశీలన చేశామే తప్ప దివ్యాంగులపై ప్రభుత్వానికి ఎలాంటి కక్షా లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రామచంద్ర, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలు విశాఖకు పయనం



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు గురువారం విశాఖపట్నానికి బయలుదేరారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వీరికి సీఎం చంద్రబాబు క్రీడాకారులకు బహుమతులు, పతకాలు ప్రదానం చేయనున్నారు. ఈక్రమంలోనే ఆర్చరీ, బాక్సింగ్, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్ క్రీడాకారులు, కోచ్‌లు దాదాపు 50మంది తరలివెళ్లారు. వీరికి డీఎస్‌డీవో శశిధర్ వారికి అభినందనలు తెలియజేశారు.

పల్లెల వికాసానికి అగ్రాసనం

● పీఎంఏజీవై నిధులతో ఎస్సీ గ్రామాలకు ప్రగతిబాట ● రెండో విడత 53 గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన
● రూ.11.20కోట్లతో పలు అభివృద్ధి పనులు ● గత పాలనలో ఈ పథకం నిధులు పక్కదారి



పెళ్లకూరు మండలం పునబాక ఎస్టీకాలనీలో పైపులైను వేస్తున్న దృశ్యం



వాకాడు మండలం బుడిగాలవాగులో సీసీరోడ్డు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.గతేడాది పగ్గాలు చేపట్టింది మొదలు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వస్తోంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానస్థితికి చేరిన రహదారుల్లో చాలామటుకు రూపురేఖలు మార్చింది. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. కేంద్రం ఇస్తున్న ప్రతిపైసాను వెచ్చిస్తూ చిత్తశుద్ధిని చాటుకుంటోంది. ఈక్రమంలోనే తాజాగా ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై)-2 కింద మంజూరైన నిధులతో ఎస్సీ పల్లెల వికాసానికి సంకల్పించింది.

చేపట్టాల్సిన పనులపై సర్వే: జిల్లాలో పీఎంఏజీవై పథకం రెండో విడతలో షెడ్యూల్‌కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, భవనాలు, ఓవర్‌హెడ్‌ట్యాంకులు, మినరల్ వాటర్‌ప్లాంట్లు, శ్మశానవాటికల నిర్మాణంతో పాటు జీవనోపాధి నైపుణ్యాభివృద్ధికీ ఈ నిధులు వెచ్చించనుంది. గ్రామానికి రూ.20లక్షలు చొప్పున మలివిడత ఎంపికైన 53 గ్రామాల్లో మంజూరైన రూ.11.20కోట్లతో చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే అధికారులు సర్వే చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిధుల పక్కదారి : వైసీపీ హయాంలో పీఎంఏజీవై కింద మొదటి విడతలో 118 గ్రామాల అభివృద్ధికి కేంద్రం రూ.23.60కోట్ల మేర ఆర్థిక సాయం ప్రకటించింది. అందులో రూ.8కోట్లు రాగా నాటి పాలకులు అభివృద్ధికి ఖర్చు చేయకుండా పక్కదారి పట్టించారు. క్షేత్రస్థాయిలో పనులు జరగకుండా సుమారు రూ.2కోట్ల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టాక విడుదలైన మరో రూ.8కోట్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించేలా శ్రద్ధ వహించారు. రెండవ విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించినట్లు పీఎంఏజీవై జిల్లా కన్వీనర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి భరోసా

ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పీఎంఏజీవై పథకం భరోసా లాంటిది. మొదటి విడతలో పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసి చాలా వరకు పనులను పూర్తి చేశాం. రెండవ విడతలో 11.20కోట్లతో మారుమూల గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతిపైసాను సద్వినియోగం చేస్తాం. పనుల్లో నాణ్యత లోపించినా, అవినీతి జరిగినా ఉపేక్షించేదిలేదు.

- వెంకటేశ్వర్, కలెక్టర్

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● 15 ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం



ల్యాప్‌టాప్‌లను చూపుతున్న ఏఎస్పీ తదితరులు

రేణిగుంట ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేసుకుంటారు. ఐఐటీ, మెడికల్ కాలేజీల్లోకి దర్జాగా వెళతారు. ల్యాప్‌టాప్‌లను అపహరిస్తారు. ఇలా వివిధ రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను ఏర్పేడు పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఇక్కడి ఐఐటీలో ల్యాప్‌టాప్‌ల చోరీ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిఘా పెట్టి నిందితులను పట్టుకున్నారు. ఈ వివరాలను రేణిగుంటలో గురువారం అదనపు ఎస్పీ రవి మనోహరా చారి మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో ఇటీవల జరిగిన ల్యాప్‌టాప్‌ల దొంగతనాలపై డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తమిళనాడు రాష్ట్రం తిరువూరు జిల్లా పులివేలం గ్రామానికి చెందిన తమిళ్ సెల్వన్, కోయంబత్తూరు జిల్లాకు చెందిన వీరాస్వామి గణేషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ ఐఐటీ, మెడికల్ కాలేజీలను టార్గెట్ చేసుకొని నకిలీ ఐడీ కార్డులతో విద్యార్థుల్లా లోపలకు ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. తమిళ్ సెల్వన్‌పై బెంగళూరు సిటీ, నాగపూర్, తిరుచ్చి, కేరళ, పాండిచ్చేరి, చెన్నై, రాజస్థాన్ రాష్ట్రాలలో 9 కేసుల్లో 500 ల్యాప్‌టాప్‌లు దొంగతనం చేసినట్లు ఇదివరకే కేసులు నమోదయినట్లు గుర్తించామని ఏఎస్పీ తెలిపారు. ఈ ఇద్దరి నుంచి రూ.8 లక్షల విలువచేసే 15 ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు, ఒక పెన్ డ్రైవ్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముఠాను పట్టుకుని విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు రికవరీ చేసిన ఏర్పేడు పోలీసులను ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ఇమామ్ హుస్సేన్, సిబ్బంది వెంకటలక్ష్మి, రాజశేఖర్, బారుషా, మహేంద్ర బాబు, మణి, మునేంద్ర, కార్తీక్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో రౌడీషీటర్ హత్య



చంద్రగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఓ రౌడీషీటర్ బుధవారం హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు చంద్రగిరి పాతపేటలోని రాములవారి గుడి సమీపంలో అశోక్‌కుమార్‌రెడ్డి అలియాస్ కొండపల్లి రాజా ఇందిరమ్మ కాలనీకిచెందిన ఓ మహిళతో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. రౌడీషీట్ ఉన్న ఇతను కొద్దిరోజులుగా ఆమెను వేధిస్తున్నాడు. ఈక్రమంలో ఆమె బుధవారం ఉదయం తిరగబడి గొడవ చేసింది. ఆమె కుమారుడు అన్వర్‌బాషా చొరబడ్డాడు. గొడవ తీవ్ర రూపం దాల్చింది. ఘర్షణలో రాజాను కింద తోయడంతో రాయి మీద పడిపోయాడు తలకు బలమైన గాయమై మృతి చెందాడు. గాయపడిన అన్వర్ బాషాను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో యువకుడికి 26 ఏళ్ల జైలు

చిల్లకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపనూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు 26 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... 2021లో తీపనూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అదే గ్రామానికి చెందిన బాలికను అపహరించి మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ పాడుపడిన ఇంట్లో అత్యాచారం చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసులుకు 26 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

11.5 కేజీల గంజాయి స్వాధీనం : ఆరుగురి అరెస్టు





నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చెన్నై రహదారి సమీపంలోని శ్రీనివాసపురం అటవీ ప్రాంతంలో 11.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఈనెల 26వ తేదీ ఎస్‌ఐ ఆదిలక్ష్మి, తహసీల్దారు రాజేంద్ర, పోలీసు, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసపురం అటవీప్రాంతంలో గాలింపు చేపట్టారు. ఆరుగురు వ్యక్తులు గంజాయి ప్యాకెట్లను పంచుకుంటూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల విలువచేసే 11.5 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. పట్టుబడిన వారు నాయుడుపేట పట్టణానికి చెందిన జాన్‌బ్లెసెన్, వినోద్, హర్షవర్ధన్, శ్రీకాంత్, సెల్వం, రాఘవ్‌గా తెలిసిందన్నారు. వీరిలో జాన్‌బ్లెసెన్‌పై భద్రాచలం, కడప జిల్లాల్లో గంజాయి కేసులు నమోదై జైలుకు వెళ్లి వచ్చాడని చెప్పారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనపరచిన అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది రాజు, రామమోహన్‌రాజు, దయాకర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, మునిశేఖర్, భాను, వెంకటేశ్వర్లను డీఎస్పీ అభినందించారు.

మరోసారి క్రీడా ప్రతిభ పాఠశాలగా 'పీఎం శ్రీ'



వడమాలపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపడంతో మరోసారి వడమాలపేటలోని పీఎం శ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 'క్రీడా ప్రతిభ' అవార్డుకు ఎంపికైంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా ప్రతి జిల్లా నుంచీ విద్యా సంవత్సరంలో విద్యార్థుల క్రీడా ప్రతిభ ఆధారంగా ఐదు పాఠశాలలకు 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' (క్రీడా ప్రతిభ) అవార్డులను ప్రదానం చేస్తుంది. 2024-25 విద్యా సంవత్సరానికి పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 57 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో, ఒకరు జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపారు. తద్వారా 222 పాయింట్లతో ఈ పాఠశాల మూడో స్థానాన్ని దక్కించుకుంది. గతంలో 2022-23 విద్యా సంవత్సరంలో 97 పాయింట్లతో ఐదో స్థానం, 2023- 24లో 178 పాయింట్లతో మూడో స్థానం సాధించింది. ఇలా వరుసగా మూడుసార్లు క్రీడా ప్రతిభకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని పీడీ చంద్రశేఖర్ రాజు చెప్పారు.

యువకుడి దారుణ హత్య

● పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు



శివారెడ్డి(ఫైల్‌ఫొటో)

వెంకటగిరి టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ తోట వద్ద బుధవారం శివారెడ్డి అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన ఆటుమడుగు ఈశ్వరయ్య కుమారుడు శివారెడ్డి(25) వెంకటగిరిలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి వద్ద నుంచి వెంకటగిరికి వచ్చాడు. రాత్రి ఇంటికి ఆకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా రాత్రి 9గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యక్తితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు వెళ్లడాన్ని గుర్తించారు. బుధవారం ఉదయం జామాయిల్ చెట్ల మధ్య శివారెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పాటు సమీపంలో పగిలిన బీరు బాటిళ్లు ఉన్నాయి. వెంటనే పోలీసు స్టేషనుకు సమాచారం ఇవ్వగా తాము వినాయక చవితి ఉత్సవాల్లో బిజీగా ఉన్నామని పోలీసులు చెప్పారు. గురువారం ఉదయం గూడూరు డీఎస్పీ గీతాకుమారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమ్మపాళెం గ్రామానికి చెందిన జానకీరామయ్య, సాయిలను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ చెప్పారు. ఆమె వెంట సీఐ రమణ, ఎస్‌ఐ ఏడుకొండలు ఉన్నారు.

గతంలోకంటే మెరుగైన రహదారులు : అమెరికా మంత్రి కితాబు



అమెరికా మంత్రి బద్రీనాథ్‌ను సన్మానిస్తున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి(రవాణా), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో కంటే రహదారుల నిర్మాణం మెరుగ్గా ఉందని అమెరికా మంత్రి లంఎకల బద్రీనాథ్ కితాబిచ్చారు. అమెరికాలో మంత్రిగా ఉంటూ ఆయన స్వగ్రామం చంద్రగిరికి వచ్చారు. ట్రాన్స్‌పోర్టు ఇంజనీరింగ్ విభాగంలో స్పెషలైజేషన్ చేసిన ఆయన రవాణాశాఖ విధి విధానాల గురించి తెలుసుకోవడానికి గురువారం ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. తిరుపతి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఘనంగా సన్మానించారు. రవాణా శాఖలో అవలంబిస్తున్న విధివిధానాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అతికానాజ్, ఏవోలు విజయకుమార్, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

నోటీసులు అందుకున్న వారికి యథావిధిగా పింఛను

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పింఛను పునఃపరిశీలనలో భాగంగా నోటీసులు అందుకుని అధికారులకు అప్పీలు చేసుకున్న దివ్యాంగులకు సెప్టెంబరు 1న యథావిధిగా పింఛను అందించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గురువారం వరకు 3,073మంది దివ్యాంగులు అప్పీలు చేసుకున్నారని వారందిరికి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

జనవరిలో పద్మావతి వర్సిటీ 22వ స్నాతకోత్సవం

● దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవాన్ని జనవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్‌పర్సన్ పద్ధతిలో స్నాతకోత్సవంలో పట్టాలు స్వీకరించడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడవచ్చునని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని ఒక ప్రకటనలో తెలిపారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

నేలకొరుగుతున్న వృక్షాలు ● పట్టించుకోని అధికారులు



ఈశ్వరవాక చెరువు కట్టపై నరికివేసిన వేప చెట్లు

చిట్టమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు నేలకొరుగుతున్నాయి... కలప వ్యాపారులు భారీ వృక్షాలను సైతం నరికి అమ్ముకుంటున్నారు. చెరువులు, తెలుగుగంగ కాలువ గట్లు, ప్రధాన రహదారులకు ఇరువైపులా ప్రభుత్వ భూముల్లో ఉన్న భారీ వృక్షాలను నరికేస్తున్నారు. కొత్తగుంట కూడలిలో కలప నిల్వ చేసి విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఈశ్వరవాక చెరువు కట్టపై వేప చెట్లను నరికేశారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో కలపను అక్కడే వదిలి వెళ్లి పోయారు. విలువైన వృక్షాలను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి మండలంలో చెట్లను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలేరమ్మ జాతరకు తొలిచాటు



పనిబాటల వారికి తాంబూలం అందజేస్తున్న రాజా కుటుంబీకులు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతరకు తొలిచాటు కార్యక్రమాన్ని బుధవారం అర్ధరాత్రి సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఎస్వీబీసీ మాజీ చైర్మన్ డాక్టర్ బీవీ సాయి కృష్ణ యాచేంద్ర బుధవారం ఉదయం దేవవదాయశాఖ ఈవో శ్రీనివాసరెడ్డి, జాతర నిర్వాహకులకు తాంబూలం అందించి జాతర నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో అంకురార్పణ జరిగింది. సెప్టెంబరు 10,11 తేదీల్లో పోలేరమ్మ జతర నిర్వహించనున్నట్లు బుధవారం అర్ధరాత్రి నుంచి చాటింపు వేశారు.

మట్టి విగ్రహాల పంపిణీ



భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కిషోర్, నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం ఆర్యవైశ్య సంఘ తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్‌కుమార్ అధ్యక్షతన వినాయక మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక గడియారం సెంటర్ వద్ద వినాయక మట్టి విగ్రహాలతో పాటు చవితి వ్రతకల్ప పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్, ప్రధాన కార్యదర్శి గాధంశెట్టి నాగరాజు, పుంజేటి వెంకటేశ్వర్లుబాబు, గంగిశెట్టి శ్రీనివాసులు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సహకార్యదర్శి కనమర్లపూడి సురేష్, యువజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడూరు కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వేదికపై చైర్‌పర్సన్ కందలి అర్చన

చిల్లకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా కందల అర్చన, సభ్యులుగా వాసవి, ముత్యాలమ్మ, వెంకటసుబ్బయ్య, రాజమ్మ, చెగల్‌రాయుడు, వెంకటేశ్వర్లు, శేషమ్మ, చలపతి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు, కల్యాణ మండపం, అన్నదాన సత్రం నిర్మాణానికి సహకరించాలని చైర్‌పర్సన్ కందలి అర్చన ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా మండలంలోని ఏరూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉడతా శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జానికిరామిరెడ్డి, చెంచు రామయ్య, లీలావతి, శ్రీనివాసులు, ప్రభాకర్, మునిశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మినుములో యాజమాన్య పద్ధతులపై అవగాహన

వెంకటగిరిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మినుము సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై కేవీకే శాస్త్రవేత్త శ్రీధర్ గురువారం రైతులకు అవగాహన కల్పించారు. మినుములో వివిధ రకాలు, విత్తన శుద్ధి, కలుపు నివారణ, పోషక యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం రైతులకు రైజోబియం జీవన ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజీవన, నాగార్జునరెడ్డి, తిరుపాల్, టీవీఎస్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.



జీవన ఎరువులు పంపిణీ చేస్తున్న కేవీకే అధిపతి శ్రీధర్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రెండు లారీల ఢీ

తడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి - చెన్నై మార్గంలో బోడిలింగాలపాడు వద్ద బుధవారం సాయంత్రం రెండు లారీలు ఢీకొన్నాయి. శ్రీకాళహస్తి నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ బోడిలింగాలపాడు వద్ద మలుపు తిరుగుతుండగా నెల్లూరు వైపు వెళ్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. చెన్నై - నెల్లూరు రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరత్‌నగర్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సాయితేజ, రమేష్ మోటారు సైకిళ్లపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సాయితేజ, రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయితేజను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖినదిలో వృద్ధురాలి మృతదేహం

పెళ్లకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు స్వర్ణముఖినదిలో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ నాగరాజు వివరాల మేరకు... శ్రీకాళహస్తి పట్టణం ఎస్‌డీకే నగర్‌కు చెందిన నార్రా ఆదెమ్మ (75) ఇంటి నుంచి వెళ్లిపోయింది. గురువారం ఉదయం కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

పెళ్లకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి జాతీయ రహదారిపై గురువారం కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. పెళ్లకూరులోని చెన్నకేశవస్వామి దేవాలయానికి చెందిన భూముల వేలం పాటకు దేవదాయశాఖ ఈవో హరికృష్ణ వచ్చారు. వేలంపాట వాయిదా పడటంతో ఈవో తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన వెళ్తున్న కారు పెన్నేపల్లి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు దెబ్బతినగా, రవికృష్ణకు ఎలాంటి గాయాలు కాలేదు.

బ్యారేజీ నిర్మించండి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది వద్ద బ్యారేజీని నిర్మించాలని కోరుతూ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





గుడూరు పట్టణం వీరారెడ్డిపల్లిలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ - నాయుడుపేట దర్గావీధిలోని గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులు

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

వాడవాడలా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ

సూళ్లూరుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మూషిక వాహనా పాహిమాం.. పార్వతీ తనయా పాహిమాం.. అంటూ ప్రజలు విఘ్ననాథుడిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఘుమఘుమలాడే వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. సుగంధ సుమాలు.. పండ్లు.. పుష్పాలు.. పత్రితో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా మట్టి విగ్రహాలతో లంబోదరుడిని సేవించుకున్నారు. ఇంటింటా వినాయక వ్రతం ఆచరించి పునీతులయ్యారు. పట్టణంతో పాటు గ్రామాల్లో యువత మండపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలతో సందడి చేశారు. పలుచోట్ల వేడుకగా ఉట్లోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. సూళ్లూరుపేట పట్టణంలోని షార్ బస్టాండు వద్ద పెద్ద గణేశ్ విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యే పూజలు చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపర్తి ఆది నారాయణరెడ్డి చేతుల మీదుగా వినాయక విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అలాగే పీర్లచావడి వద్ద మంచు పర్వతాల మీద వినాయకుడు కొలువు దీరినట్లు గణపయ్యను ఏర్పాటు చేశారు. గాండ్లవీధిలో అన్న క్యాంటీన్ వద్ద భారీ విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేశారు. గాండ్లవీధి, కోళ్లమిట్టలో గురువారం భక్తులకు అన్నదానం చేశారు. కాళంగి నదిలో నిమజ్జనానికి మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గూడూరు: పట్టణంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ముత్యాల పేట, రాణీపేట, తూర్పువీధి, మాళవ్యానగర్, వీరారెడ్డిపల్లి, ఎస్‌ఆర్‌పీ సెంటర్, అశోక్‌నగర్, అరుంధతీయపాళెం, నాయుడు కాలువకట్ట, నలజాలమ్మవీధి, కోనేటిమిట్ట తదితర ప్రాంతాల్లో కూడళ్ల వద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. పలు ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ చేపట్టారు. వీరారెడ్డిపల్లి కూడలిలో వినాయక ప్రతిమ వద్ద జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఇందిరానగర్‌లోని మోదగవనం వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీసేవ జరిపారు. తూర్పువీధిలోని వినాయకస్వామి ఆలయం వద్ద స్వామివారిని చందనంతో అలంకరించారు. ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం జరిపారు.



కోట విద్యానగర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు


కోట: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు వేడుకగా జరిగాయి. విద్యానగర్, ప్రకాశంకాలనీ, కోట క్రాస్‌రోడ్డులో యువత ఉట్టి కొట్టారు. పలుచోట్ల అన్నదానం జరిగింది. మండలంలోని శ్రీనివాసత్రం బీచ్‌లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఓజిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకు చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓజిలిలోని వినాయక దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రతిమ వద్ద టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, దంపతులతో పాటు కాటూరు కోటేశ్వరరావు పూజలు నిర్వహించారు. అదే విధంగా పున్నేపల్లిలో టీడీపీ కన్వీనరు విజయకుమార్ నాయుడు, అత్తివరంలో కనుమూరు గోపాల్‌రెడ్డి వినాయక చవితి పూజల్లో పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట పట్టణంతో పాంతో మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను వేడుకగా జరిగాయి. పట్టణంలోని దర్గావీధిలో ఏర్పాటు చేసిన 23 అడుగుల భారీ గణనాథుడిని ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పొట్లపూడి రాజేష్ ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

వెంకటగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని తూర్పువీధి, శివాలయం వీధి, ఆంజనేస్వామి సెంటర్, వెలంపాళెం సెంటర్లలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత, దైవచింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు, లాలాపేట సొసైటీ అధ్యక్షుడు గొల్లగుంట వెంకటముని, వెంకటగిరి సీఐ రమణ, ఎస్‌ఐ ఏడుకొండలు, తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, వెంకటగిరి మండల టీడీపీ అధ్యక్షుడు మురళీ గౌడ్, మంకు ఆనంద్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, అనిల్ రామారావు, పరుచూరి నరసయ్య, పునుగోటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని వెలంపాళెంలో వినాయక ఉత్సవాల్లో ఎమ్మెల్యే రామకృష్ణ

తూపిలిపాళెం తీరంలో నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు



మీడియాతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అపశృతులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో గురువారం డీఎస్పీ గీతాకుమారితో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా తీరానికి తరలిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మరో ఐదు రోజులపాటు వినాయక ప్రతిమలు వేలల్లో రానున్న నేపథ్యంలో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సముద్రతీరంలో ఇప్పటికే రెండు బోట్‌లు అందుబాటులో ఉంచామని, మరో ఐదు బోట్‌లు, క్రేన్ సిద్ధం చేస్తామన్నారు. అలాగే తీరంలో లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు నిర్ణయించిన నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనానికి వినాయక ప్రతిమలను తీసుకురావాలని సబ్ కలెక్టర్ భక్తులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, మెరైన్ అధికారులు, ఆర్‌ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి వెంకటేశ్వర అరవింద నేత్రాలయ సహకారంతో పేదలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో సీతారామనాయుడు, గౌరీశంకర్, కృష్ణ, జీవన్, డాక్టర్లు జయంత్‌రెడ్డి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

31న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

గూడూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం టెన్నికాయిట్ సీనియర్, జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ తెలిపారు. విద్యార్థులు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.

క్వాంటం టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ పేర్కొన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్-2025లో భాగంగా పద్మావతి వర్సిటీలో గురువారం ఇంటర్నల్ హాకథాన్ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీకి ప్రస్తుతం ప్రాముఖ్యత ఏర్పడిందని, దీనిపై అవగాహన ఉన్న వారికి ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ఎన్.రజని మాట్లాడుతూ టెక్నాలజీలోనూ సృజనాత్మకతను ప్రదర్శించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వసతి గృహంలో చోరీకి యత్నం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని వైద్య విద్యార్థుల వసతిగృహంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి చోరీకి ప్రయత్నించాడు. విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు తప్పించుకుని పారిపోయాడు. సెక్యూరిటీ మేనేజరు శంకర్ ఘటనపై ఆరా తీశారు. అపరిచిత వ్యక్తులు కళాశాల, ఆస్పత్రి పరిసరాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

క్రీడా పరికరాలు, కుర్చీల వితరణ



క్రీడా పరికరాలను అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

చిల్లకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో క్రీడాపరికాలు, కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రగతి సేవాసంస్థ తమ పాఠశాలకు క్రీడా పరికరాలు, కుర్చీలను అందజేయడం సంతోషకరమన్నారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, జీ.చంద్రశేఖర్, సంస్థ సభ్యులు శ్రీనివాసులు, మురళీనాయుడు, రామ్మోహన్‌రావు, రవి, వెంకటేశ్వరరావు, శ్రీహరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దండోరా కాలనీకి చెందిన భావన ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో టీడీపీ నాయకులు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని భావన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంచలయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీ విద్యార్థినులకు ఆత్మరక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ అందించారు. ఎన్‌ఎస్‌ఎస్, స్టూడెంట్ అఫైర్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఉషారాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ స్థితిలో తమను తాము కాపాడుకోవడానికి స్వీయ రక్షణ విద్య అవసరమన్నారు. దీనివల్ల ఆత్మవిశ్వాసం, ధైర్యం, చురుకుదనం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నీరజ, కరాటే నిపుణులు రత్నాకర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం: కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైవల్యా నది పూడిక తీత పనులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కైవల్యా నదిని అభివృద్ధి చేసేందుకు టీవీఎస్ సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. ముళ్ల చెట్లు పెరిగిపోయి నది పూర్తిగా పూడిపోవడంతో ఇరువైపులా ఉన్న నివాస గృహాలు ముంపునకు గురౌతున్నాయని, ఈ సమస్యను గుర్తించిన టీవీఎస్ సంస్థ 50 శాతం నిధులు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. మిగిలిన 50 శాతం నిధులు మున్సిపాలిటి భరించేలా తీర్మానం ప్రవేశపెడితే కొంతమంది కౌన్సిలర్లు ఆమోదించకపోవడం దారుణమన్నారు. ఇలాంటి కౌన్సిలర్లను గెలిపించినందుకు పట్టణ ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. నదిని అభివృద్ధి చేస్తే తమకేం లాభమన్న స్వార్థంతో ఆలోచించే కౌన్సిలర్లకు ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వెంకటగిరి అభివృద్ధి ఆగదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ తనూజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, వెంకటగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మురళీ గౌడ్, శివారెడ్డి, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేన రాజా, బ్లైండ్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి నరసయ్య, తెలుగు యువత పట్టణ కార్యదర్శి టీవీ రత్నం, 13వార్డు ఇన్‌చార్జి కౌశ్యలమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు నిధులు కేటాయించండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే వినతి



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, తిరుమూరు సుధాకర్‌రెడ్డి తదితరులు

తడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో చంద్రబాబును కలిశారు. కాళంగి, స్వర్ణముఖి నదులపై సూళ్లూరుపేట, నాయుడుపేట వద్ద ప్రస్తుతం ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని పునఃనిర్మించాల్సి ఉందన్నారు. అలాగే కాళంగి నదిలో చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే రైతాంగానికే కాకుండా సూళ్లూరుపేట పట్టణ తాగునీటికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఓజిలి, పెళ్లకూరు మండలాల టీడీపీ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సునీతసేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సునీత సేవాసంస్థ వారికోత్సవం సందర్భంగా గురువారం ఆ సంస్థ కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. డాక్టర్లు పావని, ఉషారాణి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.